


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 305, పేజీలు - 08

శుక్రవారం, ఏప్రిల్ 24, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## ఏపీ హైకోర్టుకు తొలి మహిళా సీజే లీసా గిల్

**- శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ నియమితులయ్యారు. ఈ చరిత్రాత్మక నియామకంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. జస్టిస్ లిసా గిల్‌కు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ నియామకం ఒక చరిత్రాత్మక మైలురాయి అని చంద్రబాబు అభివర్ణించారు. ఉన్నత న్యాయవ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు. జస్టిస్ లిసా గిల్ తన సుదీర్ఘ న్యాయవాద వృత్తిలో విశిష్టమైన, ఆదర్శవంతమైన సేవలు అందించారని చంద్రబాబు

2లో..

# కాళేశ్వరంపై సుప్రీంకోర్టులోనే తేల్చుకుందాం

**- హైకోర్టు తీర్పును సవాల్ చేయనున్న తెలంగాణ ప్రభుత్వం**

**- కేసీఆర్, హరీశ్ లపై చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు - ఇప్పటికే పిటిషన్ సిద్ధం చేసినట్లు సమాచారం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. వెనక్కి తగ్గకూడదని భావించిన రాష్ట్ర ప్రభుత్వం, దీనిని సుప్రీంకోర్టులో సవాలు చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించి, అత్యున్నత న్యాయస్థానంలో అప్పీలుకు వెళ్లాలని మంత్రులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలు, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. అయితే, ఈ కమిషన్ విచారణ విధానం, దాని పరిధిపై గత ప్రభుత్వంలోని కీలక నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. విచారణలో సహజ న్యాయ సూత్రాలు పాటించలేదని, ప్రతివాదుల వాదనలను సరిగ్గా పరిగణనలోకి తీసుకోలేదని వాదించగా, హైకోర్టు ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవద్దని స్టే ఇచ్చింది. ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని, ప్రజా ధనం దుర్వినియోగం అయిందని బలంగా నమ్ముతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటే పీసీ ఘోష్ నివేదిక అత్యంత కీలకమని భావిస్తున్న తరుణంలో హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి ఎదురుదెబ్బగా మారింది. అందుకే, ఈ విషయంలో న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపిన ప్రభుత్వం, ప్రాజెక్టులో జరిగిన నష్టానికి బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలంటే సుప్రీంకోర్టులో స్టే ఎత్తివేయించుకోవడమే సరైన మార్గమని నిర్ణయానికి వచ్చింది.

2లో..

## ఓటెత్తిన బెంగాల్, తమిళనాడు

**- తమిళనాడులో 234 స్థానాలకు ఒకే దశలో ఎన్నికలు**

**- పశ్చిమ బెంగాల్‌లోని 294 సీట్లు రెండు దశల్లో ఎన్నిక**

**- మొదటి విడత 152 స్థానాలకు ముగిసిన పోలింగ్**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** తమిళనాడు, పశ్చిమ్ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు గురువారం పోలింగ్ జరిగింది. ఒకే విడతలో తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు, 294 స్థానాలున్న బెంగాల్‌లో రెండు దశల్లో ఎన్నికలు జరుగుతోన్న విషయం తెలిసిందే. బెంగాల్‌లో మొదటి విడత 152 సీట్లకు పోలింగ్ నిర్వహించారు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ పోలింగ్ రికార్డుస్థాయిలో నమోదయ్యింది. తమిళనాడులో సాయంత్రం 5 గంటల వరకూ 82. 24 శాతం నమోదు కాగా బెంగాల్‌లో ఏకంగా 90 శాతం పోలింగ్ నమోదుకావడం గమనార్హం. కిందటిసారి తమిళనాడులో 76.6 శాతం, బెంగాల్‌లో 85.2 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే, 2021 ఎన్నికల్లో బెంగాల్‌లో 8 విడతల్లో పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు జనం పోటెత్తారు. బెంగాల్‌లో ఉదయం 9 గంటలకే 18 శాతం మంది ఓటేయడం గమనార్హం.

2లో..

# సొంత మనుషులను చంపుకొనే కిల్లర్ పార్టీ!


## వైసీపీపై చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

**- రాంబిల్లిలో రూ.5,400 కోట్ల రెన్యూ ఎనర్జీ ప్లాంట్లకు భూమిపూజ**

**- అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా మారుస్తామన్న సీఎం**

**- విద్యుత్ ఛార్జీలు పెంచబోమని స్పష్టం చేసిన ప్రభుత్వం**

**- నాడు కూల్చివేతలు అంటూ గత ప్రభుత్వంపై విమర్శలు**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** అనకాపల్లిలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఒక పార్టీ నేరాలు, ఘోరాలు చేస్తూ అరాచకాలకు పాల్పడుతోందని, అలాంటి కిల్లర్ పార్టీ విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. మంచి కార్యక్రమాలు, శుభ దినాల్లో కూడా ఇలాంటి దుర్మార్గులను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని, వారి గురించి ప్రజలను అప్రమత్తం చేయాల్సి వస్తోందని ఆయన అన్నారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో గురువారం రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థకు చెందిన రెండు ప్లాంట్లకు భూమిపూజ చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన గత ప్రభుత్వ తీరును, ప్రతిపక్ష నేతల వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు.

**హత్యలు చేసే కిల్లర్ పార్టీ అది**

2లో..

## మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో సగం కోత

**- తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ విషయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కేబినెట్ సమావేశంలో కార్మికుల డిమాండ్లు, సమస్యల పరిష్కారంపై కీలకంగా చర్చించామని, నేడు ఐదుగురు

2లో..

## తొందరపాటు నిర్ణయాలు

# తీసుకోవద్దు

**- ఆర్టీసీ డ్రైవర్ల ఆత్మహత్యాయత్నాలపై సీఎం రేవంత్ స్పందన**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆర్టీసీ కార్మికులు తొందరపడి ఎలాంటి కఠిన నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్టీసీ కార్మికులు చేస్తున్న డిమాండ్లు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావని హితవు పలికారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకుని, కుటుంబ సభ్యులను తీరని శోకాన్ని మిగిల్చవద్దని సూచించారు. ఈ సందర్భంగా సమావేశమైన తెలంగాణ కేబినెట్ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్టీసీ

2లో..

## తెలంగాణ ఆర్టీసీ సమ్మెలో

# విషాదం

**- నర్సంపేట డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో జరుగుతున్న ఆర్టీసీ సమ్మెలో విషాదం చోటు చేసుకుంది. సమ్మెలో భాగంగా తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ వరంగల్ జిల్లాలోని నర్సంపేట ఆర్టీసీ డిపో వద్ద ఆత్మహత్యాయత్నం చేసిన డ్రైవర్ శంకర్ గౌడ్ మరణించాడు. ఎంజీఎం నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. నర్సంపేట ఆర్టీసీ డిపోవద్ద శంకర్ గౌడ్ ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలంటూ పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నారు. ఇది గమనించిన తోటి ఆర్టీసీ కార్మికులు భయపడి కేకలు వేశారు. వెంటనే పరుగెత్తికెళ్లి శంకర్

2లో..

# మహిళా ద్రోహి రేవంత్ రెడ్డి

**- ప్రధాని మోడీ పంజా విసరడం తథ్యమన్న బండి**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మహిళా రిజర్వేషన్లను అడ్డుకోవడంతోపాటు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముమ్మాటికీ మహిళా ద్రోహి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందుతుందని భావించి సంబురాలకు సిద్ధమైన దేశ మహిళల ఆశలపై నీళ్లు చల్లారని అన్నారు. పులి పంజా విసిరేటప్పుడు ఒక అడుగు వెనకకు వేస్తోందని, అంత మాత్రాన ఓడినట్లు కాదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ సైతం మహిళా బిల్లు విషయంలో ఒక అడుగు వేశారని, రెట్టించిన ఉత్సాహంతో మరో 10 అడుగులు ముందుకేసీ రాబోయే ఎన్నికల్లోపే మహిళా

2లో..

# టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం

**- బ్యాంకులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడంలో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలని, 'జీరో మ్యూల్ అకౌంట్లు' లక్ష్యంగా పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. గురువారం నగరంలోని 45 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందిన 75 మంది సీనియర్ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల నుంచి దోచుకున్న డబ్బును మళ్లించేందుకు వాడే 'మ్యూల్ అకౌంట్ల'ను పూర్తిగా

2లో..

## జగన్‌కు వేదాశీర్వచనం.. అర్చకులకు నోటీసులు

**- ఒంటిమిట్ట ఆలయ అర్చకులకు టీటీడీ షోకాజ్ నోటీసులు**

**- ఆలయ నిబంధనలను ఉల్లంఘించారని అర్చకులపై టీటీడీ ఆగ్రహం**

**- రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** కడప జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయ అర్చకులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు షాక్ ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇంటికి వెళ్లిన ఒంటిమిట్ట ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనాలు అందించడం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలోనే ముగ్గురు అర్చకులకు టీటీడీ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అధికారుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతు తీసుకోకుండా నిబంధనలను అతిక్రమించి రాజకీయ నేతలను కలిసినందుకు గానూ ఈ నోటీసులు జారీ అయ్యాయి. ఒంటిమిట్ట ఆలయంలో అర్చకులుగా పనిచేస్తున్న ఎ. శ్రావణ్‌కుమార్, కె. పార్థసారథి, వీణా మనోజ్‌కుమార్ ఇటీవల పులివెందులకు వెళ్లారు.

2లో..

# సొంత మనుషులను చంపుకొనే కిల్లర్ పార్టీ!

"డబ్బు కోసం, ఆస్తుల కోసం సొంత మనుషుల్ని సైతం కడతేర్చే కిల్లర్ పార్టీ అది. వివేకా హత్య తరహాలోనే కడపలో దస్తగిరి అనే వ్యక్తిని హత్య చేశారు. జగన్ మోహన్ రెడ్డి మేనమామకు ప్రధాన అనుచరుడు, ఆస్తుల కోసం పెద్ద దస్తగిరిని చంపేశాడు. డ్రైవర్‌ను హత్యచేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని ఎమ్మెల్సీగా చేశారు. ఇప్పుడు అతనే సాక్షుల్ని బెదిరించే స్థాయికి వచ్చాడు. ఇలాంటి మోసగాళ్లపై మేం నిరంతరం కన్నేసి ఉంచుతాం.అధికారంలోకి వస్తే నరికేస్తాం, చంపేస్తాం, పెట్టుబడి దారులను తరిమేస్తాం అని బెదిరించే పార్టీలు మనకెందుకు? రాష్ట్రంలో మంచి జరుగుతుంటే ఆ కిల్లర్ పార్టీకి ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతోంది. నాడు ఉత్తరాంధ్రలో ప్రొక్లయినర్లతో కూల్చివేతలు జరిగేవి. నేడు అవే ప్రొక్లయినర్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ప్రకృతి వనరులు దోచిన పాలకులకు, వాటిని సంపదగా మార్చే ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు గమనించాలి" అని చంద్రబాబు అన్నారు.

### ఉత్తరాంధ్రలో ఇక ప్రతిరోజూ పెట్టుబడుల పండుగే!

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జెడ్ చింతువలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న రెండు ప్లాంట్లకు సీఎం చంద్రబాబు భూమిపూజ చేశారు. రూ.4,200 కోట్లతో 6.5 గిగావాట్ల సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, రూ.1200 కోట్లతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 2,100 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "ఉత్తరాంధ్రలో ప్రతిరోజూ పెట్టుబడుల పండుగే. అనకాపల్లి జిల్లా పెట్టుబడులతో అభివృద్ధిని ఆకర్షిస్తోంది. విశాఖ సమీపంలోని అనకాపల్లి మరో రంగారెడ్డి జిల్లాగా తయారవుతుంది. ఎన్డీఏ బ్రాండ్‌తో ఏపీలో తిరిగి విశ్వాసం వచ్చింది. పారిశ్రామిక వేత్తలకు భరోసా కలిగింది. ఈ నెల 28న 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నాం," అని వెల్లడించారు.

### రెన్యువబుల్ ఎనర్జీతో జాతి నిర్మాణం

రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు తగ్గించడమే కాకుండా, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తితో జాతి నిర్మాణానికి పాటుపడుతున్నామని చంద్రబాబు తెలిపారు. "ఏపీలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంటే, ఇప్పటికే 90 గిగావాట్ల పనులు ప్రారంభమయ్యాయి. రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులు ఈ రంగంలోకి వచ్చాయి. భవిష్యత్తులో ఆర్టీసీ బస్సులన్నీ ఈవీ బస్సులే ఉంటాయి. 40 లక్షల ఇళ్లకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తి అంటే జాతి నిర్మాణమే" అని సీఎం వివరించారు.

### గత ప్రభుత్వ తప్పులను సరి చేస్తున్నాం

గత ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని పూర్తిగా ధ్వంసం చేసిందని, ఆ తప్పులను తాము సరిదిద్దుతున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. "2019-24 మధ్య పీపీఏలు రద్దు చేసి, అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేసి వ్యవస్థను నాశనం చేశారు. ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం మోపారు. మేము చరిత్రలో తొలిసారిగా ట్రూ డౌన్ అమలు చేశాం. రూ.15,795 కోట్ల ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని మరోసారి స్పష్టం చేస్తున్నా" అని అన్నారు.

### అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధియే లక్ష్యం

రాజధాని అమరావతి నిర్మాణంతో రాష్ట్ర దశ, దిశ మారుతుందని, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం పునరుద్ఘాటించారు.

విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు రీజియన్లుగా రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధించి, 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం

నిర్మూలించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. ఇటీవల హైదరాబాద్ పోలీసులు నిర్వహించిన 'ఆపరేషన్ ఆక్టోపస్'లో భాగంగా మ్యూల్ అకౌంట్లను తెరిచేందుకు కొందరు బ్యాంకు అధికారులు సైబర్ నేరగాళ్లకు సహకరించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో సజ్జనార్ బ్యాంకు అధికారులతో నేరుగా మాట్లాడారు. అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్ & సిట్) ఎం. శ్రీనివాసులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ "బ్యాంకు బ్రాంచ్‌లు కొత్త ఖాతాలు తెరిచే టార్గెట్లపై కాకుండా, పౌరుల భద్రత, సంస్థాగత సమగ్రతపై దృష్టి పెట్టాలి. దీనికోసం 'ట్రిపుల్-ఛాలెంజ్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. 'జీరో సైబర్ క్రైమ్ బాధితులు', 'జీరో మ్యూల్ అకౌంట్లు' అనే అంశాలను బ్రాంచ్ పనితీరుకు కొలమానంగా తీసుకోవాలి. ఖాతాల సంఖ్యను పనితీరుకు ప్రామాణికంగా చూడొద్దు" అని సూచించారు. సైబర్ మోసాలకు సంబంధించి తమ సంస్థలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటించాలని, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించి, వారికి జాతీయ హెల్ప్‌లైన్ (1930), సైబర్‌క్రైమ్ పోర్టల్ గురించి తెలియజేయాలని ఆదేశించారు. మోసపూరిత ఖాతాలు తెరవడంలో పాలుపంచుకున్న కవైస్ వెరిఫైయర్లపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, అలాంటి ఉద్యోగులను బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగం నుంచే బ్లాక్‌లిస్ట్ చేయాలని అన్నారు. 'మ్యూల్ హంటర్' వంటి అధునాతన టెక్నాలజీని ఉపయోగించి మోసాలను గుర్తించాలని సూచించారు.కంబోడియా, వియత్నాం, యూఏఈ వంటి దేశాల నుంచి సైబర్ ముఠాలు పనిచేస్తున్నాయని, అవి భారతీయ మధ్యవర్తుల ద్వారా బ్యాంకు అధికారులతో కుమ్మక్కై మ్యూల్ అకౌంట్లను తెరిచి, నిధులను తరలిస్తున్నాయని సజ్జనార్ వివరించారు. ఈ నెట్‌వర్క్‌లను ఛేదించడంలో బ్యాంకుల సహకారం అత్యంత కీలకమని ఆయన తెలిపారు.

# ఏపీ హైకోర్టుకు తొలి మహిళా సీజే లీసా గిల్

కొనియాడారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగ చట్టాలకు సంబంధించిన అనేక కేసులను ఆమె నైపుణ్యంగా వాదించారని గుర్తు చేశారు. న్యాయం పట్ల ఆమెకున్న నిబద్ధత ఎంతో గౌరవాన్ని సంపాదించిపెట్టిందని తెలిపారు. జస్టిస్ లిసా గిల్ తన పదవీకాలంలో విజయవంతం కావాలని, స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు. వివేకం, చిత్తశుద్ధితో న్యాయాన్ని అందిస్తూ, చట్టబద్ధమైన పాలనను నిలబెడతారని తాను విశ్వసిస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు.

# కాళేశ్వరంపై సుప్రీంకోర్టులోనే తేల్చుకుందాం

కేబినెట్ నిర్ణయం మేరకు, ప్రభుత్వం త్వరలోనే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనుంది. ప్రాజెక్టు వైఫల్యానికి సంబంధించిన సాంకేతిక అంశాలు, విచారణ కమిషన్ సేకరించిన ప్రాథమిక ఆధారాలను కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాజకీయంగా కూడా ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల హామీ ఇచ్చిన ప్రభుత్వం, న్యాయపోరాటం ద్వారా తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని చూస్తోంది.బీఆర్ఎస్ మాత్రం ఈ కమిషన్ ఏర్పాటు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని ఆరోపిస్తున్నాయి. హైకోర్టు తీర్పు తమ వాదనకు బలాన్ని ఇచ్చిందని వారు పేర్కొంటుండగా, సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు కాళేశ్వరం భవిష్యత్తును, బాధ్యులపై తీసుకోబోయే చర్యలను శాసించనుంది. మొత్తానికి, కాళేశ్వరం విచారణ వ్యవహారం ఇప్పుడు ఢిల్లీ వేదికగా సాగనున్న న్యాయపోరాటంగా రూపుదాల్చింది.

# ఓటెత్తిన బెంగాల్, తమిళనాడు

బెంగాల్‌లో అక్కడక్కడా గొడవలు, ఘర్షణలు మినహా మొదటి దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రెండో దశలో 142 స్థానాలకు ఏప్రిల్ 29న పోలింగ్ జరగనుంది. కేరళ, అసోం, పుదుచ్చేరిలతో పాటు ఈ రెండు రాష్ట్రాల్లో మే 4న ఓట్లను లెక్కించి, ఫలితాలను వెల్లడిస్తారు. ఇదిలా ఉండగా, గురువారం ఉదయం బెంగాల్‌లో పోలింగ్ ప్రారంభమైన తర్వాత ముర్షిదాబాద్ జిల్లాలోని నౌదాలో జరిగిన పేలుడులో పలువురు గాయపడ్డారు. అక్కడ టీఎంసీ, ఏయూజేపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొన్ని ప్రాంతాల్లో ఘర్షణలు, హింస జరిగినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఏయూజేపీ అధ్యక్షుడు హుమయూన్ కబీర్ కూడా టీఎంసీ కార్యకర్తలతో వాగ్వాదానికి దిగారు. ఇది ఉద్రిక్తతలకు దారితీయడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి భద్రతా సిబ్బందిని మోహరించారు. గుంపును చెదరగొట్టడానికి పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేయాల్సి వచ్చింది.వరుసగా నాలుగోసారి గెలిచి, హ్యాట్రిక్ సాధించాలని సీఎం మమతా బెనర్జీ నాయకత్వంలోని టీఎంసీ తొలిసారి బెంగాల్‌లో కాషాయ జెండా ఎగురవేయాలని బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక, బెంగాల్‌లో ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశం ఈ ఎన్నికల్లో కీలకంగా మారింది. ఎస్ఐఆర్ ప్రక్రియతో మొత్తం 90 లక్షల ఓట్లను తొలగించారు. ఎస్ఐఆర్ విషయంలో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఈసీతో యుద్ధం చేస్తున్నారు. ఇక, బీజేపీ సైతం గెలుపుపై భారీగా ఆశలు పెట్టుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా బీజేపీ అగ్రనేతలు బెంగాల్‌లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గత ఎన్నికల్లో బీజేపీ 77 సీట్లతో ప్రతిపక్ష హోదా దక్కించుకున్న సంగతి తెలిసిందే.

# తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు

కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సర్కార్ అన్ని చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఆర్టీసీ సమ్మె , డిమాండ్లు, సమస్యలను పరిష్కరించే అంశాలపై తమ ప్రభుత్వం దృష్టి పెట్టిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రోజున ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలతో చర్చించాలని ఈ సందర్భంగా మంత్రులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ క్రమంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల బృందం, నేడు కార్మిక సంఘాలతో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది.ఇక ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యాయత్నాలు తీవ్ర దుమారం రేపుతున్న వేళ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి బాధ్యత ఉందని పేర్కొన్నారు. కార్మికులు అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. కేబినెట్ స్థాయిలో చర్చ జరగాలని అందుకు కొంత ఆలస్యమైందని వివరించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి మంత్రుల ఆధ్వర్యంలో సబ్ కమిటీ వేసినట్లు చెప్పారు. శుక్రవారం రోజున జేఏసీ నేతలతో చర్చలు జరుపుతామని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగాలు తీసివేస్తారనే ప్రచారం సరైందని కాదని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తేల్చి చెప్పారు.ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేబినెట్ సమావేశంలో చర్చ జరిగిందని మరో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఆర్టీసీ కార్మికులు తొందరపాటు చర్యలకు పాల్పడి.. ప్రాణాలు తీసుకోవడం అనేది బాధాకరమైన విషయమని ఆందోళన వ్యక్తం చేశారు. తమది ప్రజా పాలన అని ఆర్టీసీ కార్మికుల ప్రభుత్వమని తేల్చి చెప్పారు. క్షణికావేశం వల్ల అనర్థాలు జరుగుతాయని ప్రేరేపిత చర్యలు వద్దని హితవు పలికారు. శుక్రవారం ఆర్టీసీ కార్మికులతో డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో చర్చలు ఉంటాయని పేర్కొన్నారు. క్షణికావేశంలో ప్రాణాలు తీసుకునే ప్రయత్నం చేయొద్దని వెల్లడించారు. కార్మికుల కుటుంబాలకు వారి అండ అవసరమని కేబినెట్ భేటీ కంటే ముందే ఆర్టీసీ గురించి చర్చించినట్లు తెలిపారు.ఇక ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడం మరోవైపు ఆర్టీసీ కార్మికులు ప్రాణత్యాగాలకు సిద్ధపడిన వేళ ఈయూ ఆఫీస్‌లో ఆర్టీసీ జేఏసీ ఎమర్జెన్సీ మీటింగ్ నిర్వహించింది. ఈ క్రమంలోనే ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న, వైస్ ఛైర్మన్ థామస్‌రెడ్డి సమ్మె తదుపరి కార్యాచరణను ప్రకటించారు. ఈ నెల 24వ తేదీన రాష్ట్రంలోని అన్ని డిపోల ముందు ఆర్టీసీ కార్మికులు మౌన ప్రదర్శన చేపట్టాలని పేర్కొన్నారు. ఆ తర్వాత 25న అన్ని డిపోల్లో వంటవార్పు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక 26న జిల్లాల్లో ఆర్టీసీ సంఘాల కార్మిక కవాతు చేపట్టనున్నారు. 27న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల అందజేసి అన్ని డిపోల్లో మహిళా ఉద్యోగులు బతుకమ్మలతో నిరసన తెలపాలని నిర్ణయించారు. ఇక 29న డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శనలు ఉంటాయని వివరించారు.

# బస్సును ఢీకొన్న కారు ముగ్గురికి గాయాలు



**కడప** మైదుకూరు మండలం శ్రీనగరం వద్ద జాతీయ రహదారి పై ఆర్టీసీ బస్సును కారు ఢీకొంది. తిరుపతి నుండి హైదరాబాదుకు వెళుతుండగా ప్రమాం చోటు చేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు ఇరువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఆర్టీసీ బస్సును ఓవర్టేక్ చేయబోయిన సమయంలో ప్రమాదం జరిగింది. డ్రైవర్ నిద్రమత్తులో వున్నట్లు సమాచారం. గాయపడ్డ వారిని మైదుకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రిమ్స్ కు తరలించారు.. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

# మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో సగం కోత

మంత్రులు కార్మిక సంఘాలతో చర్చిస్తారని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. నర్సంపేట, నల్గొండ ఘటనలపై కేబినెట్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసిందని ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.రాష్ట్రంలోని పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పెండింగ్ బకాయిలను తీర్చేందుకు ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.

మంత్రులు,ఎమ్మెల్యేల జీతాల్లో 50 శాతం నిలిపివేసి , ఆ నిధులను రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాల కోసం మళ్లించాలని కేబినెట్ తీర్మానించింది. ఉద్యోగులకు అందాల్సిన బకాయిలపై మంత్రివర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, కేవలం 100 రోజుల్లోపు ఈ సమస్యను పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.ప్రస్తుత గణాంకాల ప్రకారం, సాధారణ ఉద్యోగులకు 6,200 కోట్లు రిటైర్డ్ ఉద్యోగులకు 8,000 కోట్లు ర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు మంత్రులు స్వచ్ఛందంగా తమ జీతాల్లో 50 శాతం వదులుకోవడానికి ముందుకొచ్చారు. ఇతర ప్రజాప్రతినిధుల జీతాలను కూడా దీనికి మళ్లించడంతో పాటు, ప్రత్యామ్నాయ నిధుల సమీకరణ మార్గాలను వెంటనే అన్వేషించాలని అధికారులను ఆదేశించారు.దాంతోపాటు కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఒత్తిడి చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించిందన్నారు. దీనిపై ఎలా ముందుకు వెళ్లాలో సబ్ కమిటీ వేశామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీ వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించింది. ఇకనుంచి ఏటా వైశాఖ శుక్ల పక్ష దశమి నాడు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ లాంఛనాలతో ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ 26 న వాసవీ జయంతి రానున్న నేపథ్యంలో ఆ రోజున ఉత్సవాలు జరపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో వాసవీ మాత జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని పేర్కొంది.

# తెలంగాణ ఆర్టీసీ సమ్మెలో విషాదం

గౌడ్‌ను అంటుకున్న మంటలను అదుపు చేశారు. అనంతరం 80 శాతం కాలిన గాయాలతో ఉన్న శంకర్ గౌడ్‌ను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

### డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి

తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. తమ న్యాయమైన 32 డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రెండు రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఒకవైపు సమ్మె చేస్తూనే మరోవైపు ఆర్టీసీ బస్ డిపోల వద్ద, బస్టాండ్‌ల వద్ద నిరసనలు చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం వరంగల్ జిల్లా నర్సంపేట బస్ డిపో వద్ద ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో 80 శాతం కాలిన గాయాలవ్వడంతో ప్రాణాలతో కొట్టుమిట్టాడాడు. తోటి ఉద్యోగులు అతడిని వరంగల్ ఎంజీఎంఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రత్యేక అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలించారు. అయితే మార్గమధ్యలో కర్మాన్ ఘాట్ వద్ద డ్రైవర్ శంకర్ గౌడ్ ప్రాణాలొదిలాడు. ప్రస్తుతం శంకర్ గౌడ్ మృతదేహం కంచన్ బాగ్ డీఆర్డీఓ అపోలో ఆస్పత్రిలో ఉంచినట్లు తెలుస్తోంది.

# మహిళా ద్రోహి రేవంత్ రెడ్డి

రిజర్వేషన్లను అమలు చేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగిన "మహిళా ఆక్రోశ్ పాదయాత్ర"లో కేంద్రహోంశాఖ సహాయశాఖ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ కూటమి నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

### రేవంత్ రెడ్డిని తిట్టని మహిళ లేదు

'రాష్ట్రంలో రేవంత్ రెడ్డిని తిట్టని మహిళ లేదు. మహిళా బిల్లును అడ్డుకుని ఏదో సంబురపడుతున్నారు. రేవంత్ రెడ్డిని శాపనార్థాలు పెడుతున్నారు. ప్రకృతిలో తల్లిని కొలిచి పూజించే సనాతన ధర్మం మనది'కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పుకొచ్చారు. గోమాత, భూమాత సహా దేవుళ్లను సైతం సతీసమేతంగానే పిలుస్తాం.

'మోడీ ప్రభుత్వం సైతం మహిళల పేరుతోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఈ సంక్షేమ పథకాలే కాకుండా రాజకీయ ప్రాధాన్యమిచ్చి చట్టసభల్లో అడుగుపెట్టేలా చేయాలనే ఉద్దేశంతో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టింది.

దీనిని అడ్డుకుని విపక్షాలు విర్రవీగుతున్నాయి. పులి పంజా విసిరేటప్పుడు ఒక్క అడుగు వెనుకకు వేస్తోంది. ఆ తరువాత 10 అడుగులు ముందుకేసీ పంజా విసురుతుంది. రాబోయే ఎన్నికల్లోపే మహిళా బిల్లును అమలు చేసి తీరుతాం. మోడీ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది'అని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

### మహిళల ఆశలపై నీళ్లు చల్లిన చరిత్ర రేవంత్ రెడ్డిది

'మహిళా బిల్లును అడ్డుకునే పార్టీలన్నీ కుటుంబ వారసత్వ పార్టీలే. సోనియాగాంధీ, ఇందిరాగాంధీ, కనిమొళి, డింపుల్ యాదవ్, సుప్రియా సూలే పార్లమెంట్‌లో ఉంటే చాలు.సాధారణ మహిళలకు చట్టసభల్లో అడుగుపెట్టే అర్హత లేదని కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ, ఎన్సీపీ పార్టీలు చెబుతున్నాయి'అని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

అందుకే మహిళా బిల్లును అడ్డుకున్నాయి. పార్లమెంట్ లో బిల్లు ఆమోదం పొందుతుందని సంబురాలకు సిద్ధమైన మహిళల ఆశలపై నీళ్లు చల్లిన చరిత్ర రేవంత్ రెడ్డిది అని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

### నరేంద్రమోడీ ప్రభుత్వం ముమ్మాటికి మహిళా పక్షపాతి

'తెలంగాణలోనూ మహిళలకు నెలకు రూ.2500లు, తులం బంగారం, స్కూటీ ఇవ్వకుండా మోసం చేయడమే కాకుండా మహిళా బిల్లును అడ్డుకున్న రేవంత్ రెడ్డిని గద్దె దించండి. అందులో భాగంగా మీ ఇంటికి వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయండి'అని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు.

'మహిళా ఆక్రోశం ఏమిటో తెలిసేలా రేవంత్ రెడ్డికి చురకలు అంటించాల్సిన అవసరం ఉంది. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని మహిళా బిల్లుకు మద్దతు తెలిపాలని సూచిస్తున్నా. నరేంద్రమోదీ ప్రభుత్వం ముమ్మాటికీ మహిళా పక్షపాతి. రాష్టపతిగా, ఆర్థిక మంత్రి బాధ్యతలను మహిళలకు అప్పగించడమే నిదర్శనం'అని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

# జగన్‌కు వేదాశీర్వచనం.. అర్చకులకు నోటీసులు

ఆ సమయంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆయన ఇంట్లో కలిశారు. ఈ క్రమంలోనే వైఎస్ జగన్‌కు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం అత్యంత పవిత్రంగా భావించే శేష వస్త్రంతోపాటు రాములోరి తోమాల, ముత్యాల తలంబ్రాలను కూడా అర్చకులు వైఎస్ జగన్‌కు అందించారు.నిబంధనల ప్రకారం టీటీడీ, దాని పరిధిలో ఉన్న ఆలయాల్లో పనిచేసే అర్చకులు, సిబ్బంది ఇలాంటి కార్యక్రమాలకు వెళ్తే తప్పనిసరిగా ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ ముగ్గురు అర్చకులు మాత్రం ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే పులివెందులకు వెళ్లడం, అక్కడ వేదాశీర్వచనం ఇవ్వడంపై టీటీడీ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.ఈ ముగ్గురు అర్చకుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఒంటిమిట్ట ఆలయ ఉప కార్యనిర్వహణాధికారి ఎ. ప్రశాంతి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం ప్రోటోకాల్ పాటించకుండా అనుమతి లేకుండా బయటి వ్యక్తులకు ఆలయ మర్యాదలు ఎలా చేస్తారని ఆగ్రహించారు. ఈ నోటీసులకు సంబంధించి 2 రోజుల్లోగా సరైన వివరణ ఇవ్వాలని లేకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అర్చకులు ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తేల్చి చెప్పారు. నిబంధనలు పాటించడం, ఆలయ పవిత్రతను కాపాడటంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని టీటీడీ అధికారులు హెచ్చరించారు.

# బీఆర్ఎస్ నిజాయతీ నిరూపించుకుంది

**సంగారెడ్డి** పటాన్ చేరు పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం పై కడిగిన ముత్యముల బిఆర్ఎస్ పార్టీ నిజాయితీ నిరూపించుకున్నదని, కోర్టు చెప్పిన తీర్పుతో ఇది రుజువైందని అన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చిన కాళేశ్వరంపై అబద్ధపు ప్రస్తావన చేస్తూ వచ్చిందని గుర్తు చేశారు.

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కాలేశ్వరం పై అబద్ధపు ప్రచారం మానుకొని 420 హామీలు, ఆరు గ్యారంటీలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. పీసి ఘోష్ కమిటీని హైకోర్ట్ వ్యతిరేకించిందనీ, అది పీసి ఘోష్ కమిటీ కాదు పిసిసి కమిటీ అని ఎద్దేవా చేశారు. రైతులను రాజులను చేయాలనే ఉదేశ్యంతో కడితే రాజకీయ కుట్ర చేసి తప్పుదోవ పట్టించారని అన్నారు. ప్రాజెక్టులపై కక్షతో రైతు బంధు ను ఎగొట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి ఇది ఎదురుకోలేని దెబ్బ అని అన్నారు. ఈ కమిటీ నీ వేసి డైవర్షన్ పాలిటిక్స్ చేసిందని, ప్రజలు అన్నీ ఆలోచిస్తున్నారనీ రాబోవు ప్రభుత్వం బిఆర్ఎస్ దే అని జగిత్యాల సభ రుజువు చేసిందన్నారు. ఈ తీర్పుతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని రాబోవు ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ జండా ఎగరవేస్తామనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, టౌన్ అధ్యక్షులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 11 వరకు స్కూళ్లకు సెలవులు

**హైదరాబాద్.** వేసవి తీవ్రత పెరుగుతున్న వేళ విద్యార్థులకు ఉపశమనం కలిగిస్తూ విద్యాశాఖ వేసవి సెలవుల షెడ్యూల్‌ను అమలులోకి తీసుకొచ్చింది. ఏప్రిల్ 23వ తేదీని ఈ విద్యా సంవత్సరానికి చివరి పని దినంగా నిర్ణయించడంతో పాఠశాలలు రేపటి నుంచి మూతపడనున్నాయి.ప్రభుత్వం ప్రకటన ప్రకారం వేసవి సెలవులు ఏప్రిల్ 24 నుంచి ప్రారంభమై జూన్ 11 వరకు కొనసాగుతాయి.

అంటే విద్యార్థులకు సుమారు 48 రోజుల పాటు సుదీర్ఘ విరామం లభించనుంది. తిరిగి జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతాయి. నేడు పాఠశాలల్లో చివరి రోజు అయినందున విద్యార్థులకు వారి విద్యా సామర్థ్యాన్ని వివరించే ప్రోగ్రెస్ రిపోర్ట్‌లను అందించనున్నారు. ఈ సెలవులు కేవలం ప్రభుత్వ పాఠశాలలకే మాత్రమే కాకుండా అన్ని ప్రైవేటు, ఎయిడెడ్, కార్పొరేట్ విద్యాసంస్థలకు వర్తిస్తుంది. నిబంధనల ప్రకారం అన్ని రకాల బళ్లు రేపటి నుంచి మూతపడాల్సిందే. సెలవుల పేరుతో విద్యార్థులను పాఠశాలలకు పిలిపించి స్పెషల్ క్లాసులు నిర్వహించడం చట్టవిరుద్ధం. ఏ పాఠశాల అయినా ఈ రూల్ అతిక్రమిస్తే ఆ సంస్థ గుర్తింపు రద్దు చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున, పిల్లలు మధ్యాహ్నం పూట బయట తిరగకుండా చూసుకోవాలని తల్లిదండ్రులకు అధికారులు సూచించారు. సెలవుల్లో పిల్లలు సరదా కోసం బావులు, చెరువులు, ఇతర నీటి వనరుల వద్దకు ఈతకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఇటువంటి సమయాల్లో ప్రమాదాలు జరుగుతాయని, తల్లిదండ్రులు పిల్లలపై నిరంతరం నిఘా ఉంచాలని కోరారు

# బక్రీద్ పండుగ... కండిషన్స్ అప్లై

**హైదరాబాద్** ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పండుగకు భాగ్యనగరం సిద్ధమవుతోంది. ఈ తరుణంలో నగరంలో శాంతిభద్రతలను పరిరక్షించడంతోపాటు ప్రజారోగ్యాన్ని కాపాడటం, పారిశుద్ధ్య నిర్వహణను క్రమబద్ధీకరించడం పోలీసు యంత్రాంగానికి, మున్సిపల్ అధికారులకు అత్యంత కీలకం. పండుగ సమయంలో పశువుల తరలింపు, ఖుర్బానీ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు హైదరాబాద్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ జోన్ డీసీసీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. బక్రీద్ సందర్భంగా పశువులను కొనుగోలు చేసేటప్పుడు, వాటిని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించినప్పుడు పాటించాల్సిన రూల్స్ పోలీసులు స్పష్టం చేశారు. పశువులను కొనుగోలు చేసే సమయంలో అవి ఆరోగ్యంగా ఉన్నాయని ధ్రువీకరిస్తూ వెటర్నరీ డాక్టర్లు నుంచి సర్టిఫికెట్ తీసుకోవడం తప్పనిసరి చేశారు. ఈ సర్టిఫికెట్ లేకుండా పశువులను తరలించడం నేరంగా పరిగణిస్తారు. సరైన పర్మిషన్ లేకుండా పశువులను వాహనాల్లో తరలించవద్దని డీసీపీ రమణారెడ్డి హెచ్చరించారు. రవాణా సమయంలో అవసరమైన అన్ని పత్రాలను డ్రైవర్ వెంటనే ఉంచుకోవాలని సూచించారు. చిన్న వయసు ఉన్న దూడలను, లేదా అనారోగ్యంతో బాధపడుతున్న పశువులను వధకు తీసుకెళ్లడం చట్టరీత్యా నేరం. కేవలం వధకు అనుమతించిన, ఆరోగ్యకరమైన పశువులను మాత్రమే ఎంపిక చేసుకోవాలి. రోడ్డుపై పశువుల విక్రయాన్ని పోలీసులు పూర్తిగా నిషేధించారు. ప్రభుత్వం కేటాయించిన నిర్ణీత ప్రాంతాల్లో లేదా ప్రైవేటు స్థలాల్లో మాత్రమే విక్రయాలు జరుపుకోవాలి. దీని వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవచ్చు. చట్టబద్ధంగా అన్ని అనుమతులు ఉండి, సరైన పత్రాలతో పశువులను తరలిస్తున్నప్పుడు ఎవరైనా వ్యక్తులు, లేదా సమూహాలు అడ్డుకుంటే భయపడాల్సిన పని లేదని పోలీసులు భరోసా ఇచ్చారు. పశవులు తరలింపును ఎవరైనా అక్రమంగా అడ్డుకుంటే వెంటనే 100కు డయల్ చేయాలని డీసీపీ సూచించారు.

చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, పత్రాలు సక్రమంగా ఉన్న వారికి పూర్తి రక్షణ కల్పిస్తామని అడిషనల్ డీసీపీ శ్రీకాంత్ స్పష్టం చేశారు. పండుగ తర్వాత పారిశుద్ధ్యం చాలా పెద్ద సవాల్‌గా మారుతోంది. దీనిని అధిగమించేందుకు జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పోలీసులు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. పశువుల వధ తర్వాత వచ్చే వ్యర్థాలను రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాల్లో వేయడం వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ?ందని అందుకే వ్యర్థాలను రోడ్లపై వేయడాన్ని నిషేధంచారు. వ్యర్థాలను పారేయకుండా వాటిని ప్రత్యేక కవర్లలో సేకరించాలి. ఇలా ఉంచిన వాటిని జీహెచ్ఎంసీ కేటాయించిన శానిటేషన్ వాహనాల్లో మాత్రమే వేయాలి. ఇందు కోసం జీహెచ్ఎంసీ ప్రత్యేక వాహనాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచుంది. బక్రీద్ పండుగను పవిత్రమైన వాతావరణంలో ఇతరులకు ఇబ్బంది లేకుండా జరుపుకోవాలని పోలీస్ శాఖ కోరుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించడం ద్వారా పౌరులు బాధ్యతాయుతంగా పండుగను నిర్వహించుకోవచ్చు.

## ఉత్సవాలలో భక్తులకు

# అన్ని ఏర్పాట్లు చేయండి

**- మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి శ్రీ**

**బ్రహ్మంగారిమఠం** వీర బ్రహ్మ క్షేత్రం (కందిమల్లాయపల్లె )జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి 333 వ ఆరాధన గురుపూజ మహోత్సవాలలో 26 తేదీ ఆదివారం వైశాఖ శుద్ధ దశమి రోజు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి సజీవ సమాధి నిష్ట వహించిన పవిత్రమైన రోజు కావున స్వామి వారి భక్తులు అత్యధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికి వస్తారు . కావున స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు మరియు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మాలా దీక్ష తీసుకున్న స్వాములకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసి వచ్చిన భక్తులకు మరియు స్వామివారి దీక్ష తీసుకున్న వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని క్యూ లైన్ లో వచ్చే భక్తులందరికీ కూడా మజ్జిగ మరియు త్రాగునీరు అందేలా చూడాలని మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి గారికి మఠం మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వేంకటాద్రి స్వాముల వారు ఆదేశించారు. భక్తులకు ఏర్పాటుచేసిన క్యూలైన్లు మరియు కళ్యాణకట్ట మరియు భక్తుల విశ్రాంతిభవనం వాటన్నిటినీ కూడా పర్యవేక్షించి మఠం పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అక్కడ ఉన్న సిబ్బందికి ఆదేశించారు.

## భక్తులకు వస్తువులు ఏర్పాటు చేయండి

**బ్రహ్మంగారిమఠం** బ్రహ్మంగారిమఠం శ్రీకాలజ్ఞాని జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి 333వ ఆరాధన గురుపూజ మహోత్సవములు 23 /4/ 2026వ తేదీ నుండి 28 /4/ 2026వ తేదీ వరకు ఘనంగా నిర్వహింపబడుతున్నాయని కావున భక్తులు ఈ గురుపూజ మహోత్సవాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకోవాల్సిందిగా 8వ తరం 12వ మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వేంకటాద్రి స్వాముల వారు భక్తులకు ఆహ్వానం పలికారు. అదే విధంగా మఠం మేనేజర్ ఈశ్వరయ్య చారి ఆరాధన గురుపూజ మహోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా భక్తులకు అవసరమగు చలువ పందిర్లు, అన్నదాన కార్యక్రమం, క్యూలైన్లలో భక్తులకు మంచినీరు మజ్జిగ వసతులు ఏర్పాటు చేయడమైందని అన్నారు.

## వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ ఘోర వైఫల్యం

**ఖమ్మం** తల్లాడ మండలంలో వరి ధాన్యం మొక్కజొన్నలు కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం, జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అన్నదాతలు ఈరోజు రోడ్డుపై బైఠాయించి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. “ప్రతి గింజ కొనుగోలు చేస్తాం” అని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు రైతులను నడిరోడ్డుపై పడేసి చేతులు ఎత్తేసిన పరిస్థితి నెలకొంది. గత 20 రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని చెప్పుకున్న ప్రభుత్వం, ఇంతవరకు ఒక్క గింజ కూడా కొనలేకపోవడం దాని అసమర్థతకు నిదర్శనం. గత 30 రోజులుగా రైతులు వరి కోతలు కోసి, ఎండబెట్టి, కొనుగోలు కేంద్రాల వద్ద రాశులుగా పోసి, ఎండవానల మధ్య రాత్రింబవళ్లు కాపలాగా పడుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందించినా, వారి నుంచి స్పందన లేకపోవడం రైతుల్లో ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈ నేపథ్యంలో రైతులంతా కలిసి తల్లాడ రింగు రోడ్డులో బైఠాయించి తమ గళాన్ని వినిపించారు. ఈ నిరసనకు భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా పూర్తిస్థాయి మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు చల్లా నాగులు, జిల్లా నాయకులు ఆపతి వెంకట రామారావు మాట్లాడుతూ రైతులను మోసం చేసిన ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని తక్షణమే ధాన్యం మొక్కజొన్నలను కొనుగోలు ప్రారంభించాలని ప్రతి గింజను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని గట్టిగా డిమాండ్ చేశారు. “రైతుల చెమటకు విలువ ఇవ్వలేని ప్రభుత్వం ఉండటానికి అర్హత లేదు. రైతుల పక్షాన చివరి గింజ కొనేవరకు భాజపా కిసాన్ మోర్చా పోరాటం కొనసాగిస్తుంది” అని స్పష్టం చేశారు. రైతుల ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో స్థానిక తహసీల్దార్, పోలీస్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని, ఈరోజు మధ్యాహ్నం నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు తాత్కాలికంగా నిరసన విరమించారు.

## టీడీపీ వర్గపోరుతో సీసీ రోడ్ల పనులు

# నిలిపివేత దురదృష్టకరం

**- తక్షణమే పనులు ప్రారంభించాలి - సీపీఐ**

**బద్వేలు** బద్వేల్ పట్టణంలో మంజూరైన 3 కోట్ల రూపాయల సీసీ రోడ్ల పనులు టీడీపీ నాయకుల



వర్గపోరు కారణంగా నిలిచిపోవడం దురదృష్టకరమని, అధికారుల పర్యవేక్షణతో తక్షణమే పనులు ప్రారంభించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పట్టణ సమితి ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో మరియు మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ శ్రీ చంద్రమోహన్ గారికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ మాట్లాడుతూ, బద్వేల్ పట్టణంలోని వివిధ వార్డులలో ఒూఖ, ఃఖూ కింద మంజూరైన 3 కోట్ల రూపాయల సీసీ రోడ్ల పనులకు రాజకీయ గ్రహణం పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిపూజలకు ఎవరిని పిలవాలనే విషయంలో టీడీపీ వర్గపోరుతో పనులు జాప్యం అవుతున్నాయని తెలిపారు. ప్రోటోకాల్ లేని ఏ ఒక్కరినీ భూమిపూజలకు పిలవకుండా, అధికారుల పర్యవేక్షణలోనే సీసీ రోడ్ల నిర్మాణం కొనసాగించాలని డిమాండ్ చేశారు.బద్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి గారితో మాట్లాడి నిధులు మంజూరు చేయించడంలో ఈ వర్గాలు పోటీ పడితే బాగుంటుందని హితవు పలికారు. అరకొర పనుల ప్రారంభోత్సవాలకు పోటీ పడటం “నవ్విపోదురు గాక నాకేంటి” అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు.అదేవిధంగా మున్సిపాలిటీలో జరుగుతున్న సెంటర్ లైటింగ్ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ స్థానికుడు కావడంతో వారి బంధువులకు పలు పనులు అప్పగించారని ప్రజలు చర్చించుకుంటున్నారని, అంతేకాకుండా మున్సిపాలిటీ కార్మికుల చేత పనులు చేయిస్తూ, వేసిన రోడ్లు కూడా నాసిరకంగా ఉన్నాయని విమర్శించారు.బద్వేల్ పట్టణ అభివృద్ధికి రాజకీయాలకతీతంగా అందరూ దోహదపడాలని, వర్గపోరుతో అభివృద్ధికి ఆటంకం కలిగించవద్దని కోరారు. తక్షణమే ఆగిపోయిన సీసీ రోడ్ల పనులను ప్రారంభించకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## నేటి నుండి వేసవి సెలవులు ప్రారంభం

**- జూన్ 12 నుండి పాఠశాలలు పునః ప్రారంభం.**

**- మండల విద్యాధికారి రమా వెంకటేశ్వర్లు.**

**తుగ్గలి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు 2025?2026 విద్యా సంవత్సరం నందు 24.04.2026 నుండి 11.06.2026 తేదీల వరకు అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు యాజమాన్య పాఠశాలలకు వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించిందని తుగ్గలి మండల విద్యాధికారి రమా వెంకటేశ్వర్లు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులలో పాఠశాలల యందు సమ్మర్ స్పెషల్ క్యాంప్ తరగతులను నిర్వహించరాదని ఆయన అన్ని ప్రైవేటు సంస్థల పాఠశాలల యాజమాన్యానికి తెలియజేశారు.వేసవి సెలవులలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తే అటువంటి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు.ఈ సంవత్సరం ఎండలు అధికంగా ఉండడం వలన విద్యార్థులు బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలియజేశారు.వేసవి సెలవుల అనంతరం జూన్ 12వ తేదీన పాఠశాలలు తిరిగి పునః ప్రారంభమవుతాయని మండల విద్యాధికారి రామా వెంకటేశ్వర్లు తెలియజేశారు.

# నంద్యాల పెద్ద చెరువు అభివృద్ధికి కార్యాచరణ ప్రారంభం

**- త్వరలో ప్రజలకు 2.5 కి.మీ. వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి**

**- గ్రీనరీ, పగోడాలతో చెరువు సుందరీకరణ**

**- కట్ట రక్షణకు ఫెన్సింగ్, బౌండరీ ఏర్పాటు700 ఎకరాల చెరువు**

**- నంద్యాలకు కీలక ఆస్తిజిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల,** నంద్యాల పట్టణంలోని పెద్ద చెరువును సమగ్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. గురువారం వాటర్ రిసోర్సెస్ శాఖ అధికారులతో కలిసి చెరువు పరిసరాలను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా చెరువు అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చెరువు చుట్టూ సుమారు 2.5 కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ట్రాక్‌ను సౌకర్యవంతంగా అభివృద్ధి చేయాలని సూచించారు. చెరువు పరిసరాల్లో గ్రీనరీని పెంపొందిస్తూ, షెడ్ పగోడాలు ఏర్పాటు చేసి అందమైన వాతావరణాన్ని సృష్టించేందుకు బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు విశ్రాంతి, వినోదం కలిగించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.×చెరువు కట్టను ఆక్రమణల నుంచి రక్షించేందుకు బౌండరీ ఫిక్సింగ్, ఫెన్సింగ్, ట్రెంచెస్ ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ కట్టను శాశ్వతంగా సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వర్షాకాలానికి ముందే సివిల్ పనులను పూర్తి చేసి, వర్షాలు ప్రారంభమైన వెంటనే విస్తృతంగా మొక్కలు నాటి గ్రీనరీని పెంపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పాలేరు వాగు, చామ కాలువలతో అనుసంధానమై సుమారు 700 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పెద్ద చెరువును సమగ్రంగా అభివృద్ధి చేస్తే, నంద్యాల పట్టణానికి ఒక విలువైన ఆస్తిగా మారుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ శివ శంకర్ రెడ్డి, కేసి కెనాల్ డీఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

## పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం

**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డ టౌన్ లోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర కడప రోడ్డు వైపున ఉన్న ఎస్ ఆర్ కె ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్స్ శేఖర్, ప్రిన్సిపాల్ నాగరాజు ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా అపుస్మా ఆళ్లగడ్డ నియోజవర్గం యూనిట్ అధ్యక్షులు టి అమీర్ బాషా , నాగేశ్వరరావు యూ బి ఐ ఆఫీసర్ అహోబిలం మరియు ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రు లు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా సభను ఉద్దేశించి అపస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ అధ్యక్షులు టి అమీర్ బాషా సందేశానిస్తూ నేటి పోటీ ప్రపంచంలో ఆంగ్లభాషతోపాటు మన తెలుగు భాషను ప్రోత్సహిస్తూ విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తూ సమాజానికి ఉత్తమ పౌరులను అందించే బాధ్య విద్యాసంస్థల యాజమాన్యం బాధ్యత తల్లిదండ్రుల కలలు సహకారం చేస్తూ దేశభక్తి నిర్మాణం నవభారత నిర్మాతలుగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులది సెల్ ఫోన్ ల వ్యసనం నుండి తమ పిల్లలను కాపాడే బాధ్యత తల్లిదండ్రులది విద్యార్థులను చదువులు క్రీడలు, వారిలోనున్న సుజనాత్మకతను ప్రోత్సహిస్తూ వార్షిక ప్రగతిని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది.

## నంద్యాల ప్రభుత్వ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్

**- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి ఫరూక్**



**నంద్యాల,** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈరోజు నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. మంత్రి ఫరూక్ స్వయంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. వడ్డించిన ఆహార పదార్థాల రుచిని, నాణ్యతను పరీక్షించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని తెలిపారు. భోజనం చేస్తున్న సమయంలో మంత్రి ఫరూక్ విద్యార్థినులతో ముచ్చటించారు. పాఠశాలలో అందుతున్న విద్యా సౌకర్యాలు, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని, పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని మరియు మధ్యాహ్న భోజన పథకాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత విద్యాశాఖ అధికారులను మంత్రి ఫరూక్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, డీఈవో జనార్దన్ రెడ్డి, నిత్యానంద రాజు , విజయ కుమారి, శంకర్ ప్రసాద్, బ్రహ్మం నాయక్, శంకర్ రెడ్డి, హెచ్ఎం చిత్రలేఖ , లక్ష్మీదేవి, ఉర్దూ డిఐ అస్మద్దీన్, కాంట్రాక్టర్ రవి రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రావుస్ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

**నంద్యాల** నంద్యాల స్థానిక రావుస్ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫేజ్-2 ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, అత్యుత్తమ పర్సంటేజ్ సాధించారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను నంద్యాల మంత్రి గారి క్యాంప్ కార్యాలయం నందు న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ప్రత్యేకంగా అభినందించి, వారిని ఘనంగా సన్మానించారు.మంత్రి ఫరూక్ గారి చేతుల మీదుగా సన్మానం పొందిన విద్యార్థులు హర్షిత్ (95.4075), ఇష్రత్ సుల్తానా (95.2315), పృథ్వీ రాజ్ (93.9114), రాకేష్ (92.9856) మంజునాథ్ (91.3018), ఒమర్ సాకిబ్ (91.1917), హేమంత్ (90.5754), సుధాకర్ (90.4809) లను మంత్రి ఫరూక్ ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ వంటి కఠినమైన పరీక్షల్లో నంద్యాల విద్యార్థులు ఇంతటి ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణం అన్నారు విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు . నంద్యాల ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను మరియు అత్యాధునిక వసతులను స్థానికంగానే అందిస్తున్న రావుస్ జూనియర్ కళాశాల యాజమాన్యాన్ని ఏఎంవి అప్పారావు , మౌని చంద్ర లను ప్రత్యేకంగా అభినందించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ తరగతులు, ఏసీ వసతులతో నూతన భవనాన్ని నిర్మించడం శుభపరిణామం అని అన్నారు . ఇలాంటి విద్యా సంస్థల వల్ల మన ప్రాంత విద్యార్థులు ఇతర నగరాలకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే జాతీయ స్థాయి ర్యాంకులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు

### ఈ నెల 25 న శ్రీ వాసవి జూనియర్ కళాశాల నందు జాబ్ మేళా కార్యక్రమం

**చాగలమర్రి** చాగలమర్రి లోని శ్రీ వాసవి జూనియర్ కళాశాల నందు ఈ నెల 25 వ తేది నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుంది. వైయస్సార్ కడప జిల్లా వైయస్సార్ ఈఎంసి కొప్పర్తి వద్ద గల ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ అయిల్ డిక్సన్ ప్రైవేట్ లిమిటెడ్, సోలార్ మ్యాన్ పాక్సరింగ్ కంపెనీల నందు పనిచేయుటకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్, డిప్లమో, మరియు బీటెక్ చేసిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీరికి నెలసరి జీతం 13,000/- నుంచి 25,000/- వరకు ఉంటుందని అలాగే అటెండెన్స్ బోనస్ 1,000/- వాటితో పాటుగా చాగలమర్రి నుంచి కడపకు ఉచితంగా అయిల్ డిక్సన్ బస్సు రూట్ సౌకర్యం ఉందని అలాగే భోజన సౌకర్యం కూడా ఉచితంగా లభిస్తుందని ఇంట్రెస్ట్ ఉన్న యువతీ యువకులు వారి యొక్క ఆధార్ కార్డు, మార్కు లిస్టు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, పాన్ కార్డు, రెండు ఆఫ్ ఫోటోలు తీసుకొని ఈనెల 25వ తేదీ చాగలమర్రి వాసవి జూనియర్ కళాశాలలో జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొనాలని తెలియజేయడం జరిగింది.

# భార్యను హతమార్చిన భర్త



**ఆళ్లగడ్డ** నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలోని చాంద్ వీధిలో దారుణం చోటు చేసుకుంది. కట్టుకున్న భర్తనే కాలయముడిగా మారి భార్య పుష్ప (30) ని కత్తితో గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. కుటుంబ కలహాల కారణంగానే ఈ హత్య జరిగినట్టు తెలుస్తుంది. హత్య చేసిన వెంటనే నిందితుడు చెన్నయ్య పిల్లలను తీసుకొని ఇంటి నుండి పరారయ్యాడు. ఘటనా స్థలాన్ని ఆళ్లగడ్డ డి.ఎస్.పి శ్రీనివాసరావు సందర్శించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. క్లూస్ టీమ్ ద్వారా వివరాలను సేకరిస్తామని ఆయన తెలిపారు. టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారుద

## పీసీ ఘోష్ నివేదికపై హైకోర్టు తీర్పు

# కాంగ్రెస్ పార్టీ కుట్రలకు చెంపపెట్టు

**- రాజకీయ అవసరాల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు పై అసత్య ప్రచారం**

**- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్**



**హుస్నాబాద్** ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన స్టే బీఆర్ఎస్ పార్టీ నిజాయితీకి నిదర్శనం.రాజకీయ కక్షసాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తు రైతులను ఆగం చేసింది ఈ కాంగ్రెస్ పార్టీ.ఇప్పటికైనా రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేస్తు సాగునీటిని విడుదల చేయాలి.రెండున్నరేళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్అది పీసీ ఘోష్ కమిషన్ కాదని, ముమ్మాటికీ పీసీసీ నివేదికని బీఆర్ఎస్ పార్టీ ముందు నుంచి చెబుతున్న మాట ఇవ్వాళ అక్షరాలా నిజమని తేలిపోయింది.భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైంది.ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలకు బ్రేక్ పడినట్లయింది.ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజిలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు పిల్లర్లను రిపేర్ చేసి, రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలి.గోదావరి జలాలను పక్క రాష్ట్రానికి దోచిపెట్టి, తెలంగాణలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే కుతంత్రాలను ఇంకా కొనసాగించాలని చూస్తే రేవంత్ సర్కారును రైతులు ఉరికించి కొట్టే రోజులు తప్పవని హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది, రైతుల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటుంది అని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## హోళగుందలో పోషణ పక్వాడ్ కార్యక్రమం




**హోళగుంద** మండల కేంద్రంలో గురువారం డిపిఏపీ ప్రాథమిక పాఠశాలలోని అంగన్వాడి కేంద్రం 6 నందు ఐసిడిఎస్ సూపర్ వైజర్ షిబా రాణి ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్ సిడిపిఓ నర్సమ్మ హాజరయ్యారు.ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఏప్రిల్ 9వ తేదీ నుండి ఏప్రిల్ 23 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.మరియు కార్యక్రమంలో గర్భవతులు,బాలింతలకు పాటించాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.అంతేకాకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త హెచ్,లక్ష్మి,హెల్త్ డిపార్ట్మెంట్,బాలింతలు,గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం మరచిన క్రూరత్వం

### - పసి పాపను వదిలేసిన గుర్తు తెలియని వ్యక్తులు

**- శిశువును కాపాడిన పోలీసులు - దర్యాప్తు ప్రారంభం**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో హృదయ విదారక ఘటన గురువారం చోటుచేసుకుంది.పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో పుట్టిన వెంటనే ఓ ఆడ పసిపాపను గుర్తుతెలియని వ్యక్తులు మూత్రశాలలో వదిలిపెట్టి వెళ్లిపోయారు.మూత్రశాల వద్ద నుంచి పసిపాప ఏడుపు వినిపించడంతో అక్కడ ఉన్న ఓ మహిళ గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని శిశువును రక్షించారు. అనంతరం శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలిసి పాపను ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో వైద్యులు పాపను పరీక్షించి అవసరమైన చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం పసిపాప ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, శిశువును వదిలిపెట్టిన వ్యక్తులను గుర్తించే దిశగా దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

## వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం హర్షణీయం: రాజమౌళి గుప్తా



గజ్వేల్( ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం హర్షణీయమని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్తా అన్నారు.సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వైశాఖ శుక్లపక్ష దశమి నాడు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రకటించడం పట్ల ఆర్యవైశ్య సంఘం తరఫున స్వాగతం తెలిపారు.ఈ నెల ఏప్రిల్ 26న గజ్వేల్‌లో వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే ఆర్యవైశ్య సమాజంలో ఉన్న నిరుపేదలను ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాలని, నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్పొరేషన్ ద్వారా తక్కువ వడ్డీ రుణాలు మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం

**ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి ఆరోపించారు.సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారని, అయితే ఇప్పటివరకు ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు కాలేదని విమర్శించారు.కేవలం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే అమలు చేశారని, మిగతా పథకాలన్నీ మాటలకే పరిమితమయ్యాయని అన్నారు. ఆసరా పెన్షన్లు నిలిపివేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.అలాగే కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, అమలు చేయడంలో విఫలమయ్యారని, పెళ్లి అయిన తర్వాత కూడా లబ్ధిదారులకు ప్రయోజనం అందడం లేదని విమర్శించారు. రైతులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందడం లేదని, ఎరువులు, విత్తనాలు కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, పంటలకు గిట్టుబాటు ధరలు కూడా లభించడం లేదని మండిపడ్డారు.ఇక ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని రెండేళ్లు గడిచినా నెరవేర్చలేదని, అందుకే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారని పేర్కొన్నారు. వారికి టీఆర్ఎస్ పార్టీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి డిమాండ్ చేశారు.

## సిద్ధిపేట పోలీస్ 'ఉద్యోగ మిత్ర'

**- ఏప్రిల్ 25న మెగా జాబ్ మేళా**




గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో "సిద్ధిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర" పేరిట భారీ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తోగుట ఎస్ఐ వి. రవికాంత్ రావు తెలిపారు.ఈ జాబ్ మేళా ఏప్రిల్ 25న ఉదయం 9 గంటల నుంచి సిద్ధిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్ (ఇందుర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో) లో నిర్వహించబడుతుంది.ఈ మేళాకు 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ మరియు ఇతర వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. ఐటి, ఫార్మసీ, ఇండస్ట్రీ తదితర రంగాలకు చెందిన అనేక కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి.ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత ధృవపత్రాల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, కనీసం ఐదు రెజ్యూమ్ కాపీలతో హాజరు కావాలని సూచించారు.తొగుట మండలంలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎస్ఐ రవికాంత్ రావు కోరారు.

# హుస్నాబాద్ భూములలో రియాల్టర్లు పాగా పట్టించుకోని పోలీసులు

**పట్టేదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్న నకిలీ పట్టేదారులు**

**ఏడాదికాలంగా ఎన్నో అవస్థలు పడుతున్న రైతులు**

**"పట్టా భూములలో ఫినిషింగ్ వైరుని తొలగించి కడీలు నాటారని పోలీసులకు ఫిర్యాదు చేసిన చట్టరీత్య చర్యలు తీసుకోకపోవడం శోచనీయం, పట్టేదారుల ఆవేదనలు.ఇరువురు సర్వేనెంబర్లలో అక్కడ భూమి ఉన్నదని.. ఇక్కడ భూమి ఉన్నదని.. అడ్డిమార్.. గుడ్డి సూటిగా కడీలు నాటిన నకిలీ పట్టేదారులు"**





భువనగిరి (ప్రశ్న న్యూస్) భువనగిరి పట్టణం హుస్నేనాబాద్ గ్రామంలో గల సర్వే నెంబర్లు 208,205,207 మిగులు భూములు ఉన్నాయని ఆయా సర్వే నెంబర్లలో గల పట్టేదారులను గత సంవత్సర కాలంగా కొంతమంది భూకబ్జాదారులు ఇబ్బందుల గురిచేస్తూ, భయభ్రాంతులకు గురిచేస్తూ మీ భూములలో మిగులు భూములు ఉన్నాయని, ఆ పట్టేదారులకు తెలియకుండా ప్రైవేట్ సర్వేలను పెట్టి భూములను కొలిపిస్తూ.. ఉన్న కడీలను తొలగిస్తూ.. రైతులను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని మండవ శ్రీశైలం, కళమ్మ, కిష్టయ్య, అల్లం మహేష్, నిరంజన్ రెడ్డి లు ఆవేదన వ్యక్తం చేశారు. గత 50 సంవత్సరాలుగా హుస్నేనాబాద్ నుండి హన్మాపురం వరకు ఉన్న బండ్లబాట ఉన్నప్పటికిని ఇటీవల దానిని గత 20 సంవత్సరాల క్రితం గ్రామపంచాయతీ నిధులతో సుమారు పది లక్షల ఖర్చు చేసి రోడ్డును వెడల్పు చేసే కార్యక్రమము చేశారు. అనంతరం ఇటీవల హుస్నేనాబాద్ కాలనీ మాజీ కౌన్సిలర్.. మున్సిపల్ నిధులతో లక్షల రూపాయల ఖర్చు చేసి.. అదే రోడ్డును వెడల్పు చేసే కార్యక్రమాన్ని గత సంవత్సరం క్రితం నిర్వహించారు. ఈ బాట నకిలీ పట్టే పట్టేదారు భూములలో ఉందని, ఆయా భూములకు అసలు పట్టేదారులకు రోడ్డు లేదని, నకిలీ పట్టేదారులు బెదిరించడం ఎంతవరకు సమంజసం అని ఆయా పట్టేదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యవసాయ భూములకు రహదారులు లేకుంటే కచ్చితంగా రహదారుల అవకాశం కల్పించేందుకు రెవెన్యూ విభాగం తహసిల్దార్ ఆధ్వర్యంలో రహదారులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆయా సర్వే నెంబర్లలో భూమి లేకున్నా, వారి సరిహద్దులు ఎక్కడో ఉన్నప్పటికిని, ఆ సరిహద్దులు మార్చి పట్టేదారుల పక్కన చేరి, ఇక్కడ భూమి ఉన్నదని పట్టేదారులను బెదిరిస్తూ ఇటీవల మద్రి వసంత, మద్రి చంద్రయ్య వారి కుమారులు, (ఎలాంటి భూమి లేని.. కాగితం కప్తాలేని...అల్లం మల్లేశ అతని కుమారులు ) ఇతరులు కలిసి ఎకరం 19 గుంటల భూమిని నకిలీ పట్టాలు చేసుకుని అసలు పట్టేదారులను ఇబ్బందుల గురిచేస్తున్నారని.. పై పట్టేదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన భూమిలో ఐదు గుంటల భూమి ఉన్నదని,మీ రోడ్డు పట్టా భూములో ఉందని, పైన భూమిని నకిలీ పట్టాదారులు కొనుగోలు చేసుకొని, తన భూమిలో భూమి ఉందని, తన కడీలు, ఫినిషింగ్ వైర్ ను తొలగించి.. తన కడీలనే తన భూమిలో నాటారని భువనగిరి సీఐ కి తాను 6/2/26 లో ఫిర్యాదు చేశానని, వారిపై ఎలాంటి కేసు బుక్ చేయకపోవడంతో అదే క్రమంలో వారు తన భూమిపై మరొక్కసారి వచ్చి 10-4-26 లో మరోసారి తన భూమిలో సరిహద్దులలో ఉన్న కడిలు, వైరును తొలగించి తన కడీలనే తన భూమిలో పాతడం ఎంతవరకు సమంజసం అని ఈ విషయమై తేదీన భువనగిరి సీఐకి చేసినప్పటికిని వారిపై ఎలాంటి చట్టరీత్యా చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని సర్వేనెంబర్ 208 పట్టేదారులు మండవ శ్రీశైలం ఇతరులు ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సర కాలంగా నిత్యం ఈ సర్వే నెంబర్లలో.. భువనగిరి తాతా నగర్ నుండి బ్రోకర్లు నక్కల అంజయ్య, గుండెబోయిన నరసింహ, పాక గోపాల్ లు వచ్చి పాగా వేసి.. నకిలీగా రిజిస్ట్రేషన్ చేసుకున్న పట్టేదారుతో కుమ్మక్కై.. వారితో పదో పరుకకు ఆశపడి.. ప్రస్తుతం ఆ భూములపై ఉన్న పట్టేదారులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పైన గల పట్టేదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ భూములలో ప్రభుత్వ సర్వే ఎన్నో మార్లు సర్వే చేశారని, ఇక్కడ ఆ సర్వే నెంబర్లు మిగులు భూమిలేదని రిపోర్టు ఇచ్చినా.. ఈ దళారులు భూమి ఉన్నదని పట్టేదారులను బెదిరిస్తూ నిత్యం ఇబ్బందులకు గురిచేస్తున్నారు.భూమిలేని ఈ ప్రాంతంలో ఓ రియల్టర్ బ్రోకర్ లు ఇరువురు మాజి కౌన్సిలర్ల భర్తలు.. ఒక ఎకరం 19 గుంటల భూమి, ముగ్గురు పట్టేదారుల భూములలో భూమి ఉన్నదని, సోయితప్పిన ఈ రియల్టర్లు, వేరే వారి వద్ద లక్షల రూపాయలు తీసుకొని ఓ వ్యక్తికి నకిలీ పట్టా చేసి..అదే నెలలో ఒక ఆరేడు పట్టాలను ఇతరులకు మార్పిడి చేసి.. "చాటలో తవుడు పోసి కుక్కలకు ఏగులాట పెట్టినట్టు.. సొమ్ము ఒకరిది సోకు మరోకరిది.. అన్న చందంగా వ్యవహరించిన.. ఈ మాజీ మహిళా కౌన్సిలర్ల భర్తలు ఆడిన ఆటలు.. రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆయా కాలనీలలో ఇబ్బందుల గురిచేసిన ఈ కౌన్సిలర్లకు ఓటర్లు ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో వీరికి సరైన బుద్ధి చెప్పి వారి" సతీమణులను ఎన్నికలలో" ఓటమిపాలు చేశారు. ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులు, రెవిన్యూ, తాసిల్దార్, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని నకిలీ పట్టేదారులపై, వారికి అమ్మి సొమ్ముకాజేసుకున్న రియాల్టర్ బ్రోకర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పట్టేదారులు పలువురు కోరుతున్నారు. ఉన్నభూమి కన్నా అసలే భూమి తమకు తక్కువ ఉన్నదని పలువురు పట్టేదారులు ఆరోపిస్తున్నారు. అసలు పట్టేదారులకు రావలసిన భూమి నకిలీ పట్టేదారుల చేతులు మగ్గుతూ అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై ఆయా పట్టేదారులు 100కు పలుమార్లు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. అయినా పోలీసులు పట్టించుకోకపోవడంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదని పట్టే దారులు ఆరోపిస్తున్నారు. హుస్నేనాబాద్ నుండి.. హన్మాపూర్..పోయే బండ్లబాట విషయమై.. ప్రస్తుతం ఉన్న రహదారి విషయమై.. భువనగిరి తహసీల్దార్ జగన్ ను వివరణ కోరగా ప్రభుత్వ నిధులతో రోడ్డులు వేసి.. ఉన్న బాటను ఎవరైనా ఆక్రమిస్తే..వారిపై చట్టరీత్యా కేసులతో పాటు.. భూఆక్రమణ కింద వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రైతులకు తాకులాట పెట్టి ఏమి తెలవని సుద్దపూసల వ్యవహరిస్తున్న ఇరువురు మాజీ మహిళా కౌన్సిలర్ల భర్తలు.. అందుకే వీరిని ఈ ఎన్నికల్లో ఆయా వార్డులలో ఓటర్లు వీరిని స్వీకరించలేదు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేసిన వీరిని ప్రజలు ఛీ కొట్టి ఓడగొట్టారు.

## తిరుపతి జిల్లాలో తీవ్ర విషాదం

**- తల్లి, భార్యను చంపి వ్యక్తి ఆత్మహత్య..**

**- తండ్రిని రక్షించే క్రమంలో ఇద్దరు పిల్లలు మృతి**





**తిరుపతి** తిరుపతి జిల్లా నారాయణవనం మండలం వెంకటకృష్ణ పాలెం గ్రామం చాకలి వీధిలో మోహన్ అనే వ్యక్త తన తల్లి చంద్రకళ(65), భార్య హరిత(33), కొడుకు కౌశిక్(14), కూతురు హరిణి(12)తో కలిసి నివాసం ఉంటున్నాడు. హరిత ఇంటి వద్ద టైలరింగ్ చేస్తుండగా, హరిత సోదరుడు బాలకృష్ణతో కలిసి మండల కేంద్రంలో సిమెంట్ షాపు నడిపిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం భోజనం తెస్తానని ఇంటికి వెళ్లి ఎంతకూ తిరిగి రాకపోవడంతో, ఇంటికి వెళ్లి చూడగా విగతజీవులుగా పడి ఉన్న హరిత, చంద్రకళలను గుర్తించి బాలకృష్ణ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మోహనే వారిని చున్నీతో మెడ బిగించి హత్య చేశాడని పోలీసులు గుర్తించారు. ఆదే రోజు మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లి తన మామ చనిపోయాడని పిల్లలను తీసుకెళ్లి ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో, సాంకేతిక పరిజ్ఞానంతో మోహన్ ఆచూకీ కోసం పోలీసులు వెతికారు. పిల్లలను తన ద్విచక్ర వాహనంపై అనేక ప్రాంతాల్లో తిప్పి రాత్రి 7:15 గంటలకు పుత్తూరు మండలంలోని వేపగుంట రైల్వే స్టేషన్ సమీపంలో వాహనం ఆపి, ఒక్కసారిగా పట్టాలపై మోహనం తల పెట్టాడు. చనిపోవద్దని ఎంత వేడుకున్నా స్పందించకపోవడంతో తండ్రిని పక్కకు లాగే ప్రయత్నం చేసే క్రమంలో 100 కిలోమీటర్ల వేగంతో వచ్చిన రైలు ఢీకొని తండ్రి, పిల్లలు అక్కడికక్కడే మృతి చెందారు. మరోవైపు మోహన్కు ఎలాంటి ఆర్థిక, కుటుంబ సమస్యలు లేవని బంధుమిత్రులు చెప్తున్న క్రమంలో, కేసు నమోదు చేసి ఈ దుర్ఘటనకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా రవాణా రక్షణే ప్రధాన ధ్యేయం

**- ఆర్టీసీ బస్టాండ్ వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్త్"**

**- జిల్లా ఎస్పీ డి.జానకి**


**మహబూబ్నగర్** పట్టణంలోని ఆర్టీసీ నూతన బస్టాండ్ను జిల్లా ఎస్పీ డి.జానకి, గారు సందర్శించారు. టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సమ్మె నేపథ్యంలో నగరంలోని పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడిన ఎస్పీ , సమ్మె పరిస్థితుల్లో కూడా ప్రజా రవాణా సేవలు నిరంతరంగా కొనసాగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ప్రత్యేకంగా, ప్రైవేట్ డ్రైవర్లు మరియు సిబ్బంది ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, వారికి పూర్తిస్థాయి పోలీసు రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థకు అంతరాయం కలిగించే చర్యలు, బస్సులకు నష్టం కలిగించడం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం వంటి కార్యకలాపాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోవడం లేదని హెచ్చరించారు. అటువంటి సంఘటనలు చోటుచేసుకుంటే, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తక్షణమే తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భనలో అదనపు ఎస్పీ ఔః రత్నం, ంఖీ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ (ఖీఓ) సంతోష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు , డీసీఆర్బీ డీఎస్పీ రమణా రెడ్డి, , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మొతిరాం, , టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజుద్దీన్ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా అదనపు ఎస్పీగా చేతన్ నితిన్ బాధ్యతలు స్వీకరణ



**జగిత్యాల** జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ గా చేతన్ నితిన్ గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో బాధ్యతలు స్వీకరించారు. తరువాత జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను ను అందజేసారు. చేతన్ నితిన్ ఐపిఎస్., 2022 బ్యాచ్కు చెందిన అధికారి. గతంలో జనగామ ఏఎస్పి గా విధులు నిర్వర్తించారు.

## ఆన్ లైన్ బెట్టింగ్ వ్యవహారంలో 15 మంది అరెస్టు



**గుంటూరు** ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని వేరు వేరు పోలీస్ స్టేషన్ లలో ఆన్లైన్ బెట్టింగ్ పాల్పడుతున్న 15 మంది ముద్దాయిల ను పోలీసులు అరెస్ట్ చేసారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఐపిఎల్ ఒ సీజన్ కావడంతో బెట్టింగ్ ముఠాలు గ్రూపులుగా ఏర్పడి బెట్టింగ్లకు పాల్పడుతున్నాయి. రాబడిన సమాచారం మేరకు లాలపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బెట్టింగ్ ముఠా పై దాడులు చేశాం.. ఇస్లావత్ నాయక్ అనే ముద్దాయి నేషనల్ ఎక్స్చేంజ్ అనే యాప్ ద్వారా మరికొంత మందితో బెట్టింగ్ కి పాల్పడుతున్నాడని అన్నారు.ఈ దాడిలో 1,25000 నగదు 10 సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నాం మధ్యవర్తుల ద్వారా కేసు నమోదు చేశాం.. ఓల్డ్ గుంటూరు స్టేషన్ పరిధిలో బని రియాజ్ అనే అతను ఆన్లైన్ లో మరో ముగ్గురితో బెట్టింగ్ కి పాల్పడుతున్నాడు. రియాజ్ వద్ద నుండి 75,000 నగదు 3 సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నాం. యువత ఈ బెట్టింగ్లపై ఆసక్తి ఎక్కువ చూపుతున్నారు. బెట్టింగ్ చెయ్యడం మూలంగా నష్టమే కానీ లాభం ఉండదు ప్రజలందరూ ఈ విషయం గమనించాలి. ఏపీ గేమింగ్ యాక్ట్ సెక్షన్ 66గుడ్ ఎ యాక్ట్ ప్రయోగించి వీరందరి పై కేసు నమోదు చేశామని అన్నారు.

## హైకోర్టు స్టేతో కాంగ్రెస్ కుట్రలు బట్టబయలు

- "పీసీ ఘోష్ కాదు - పీసీసీ నివేదికే" - బీఆర్ఎస్ విమర్శలు

- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు : కత్తెరపాక కొండయ్య



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య మాట్లాడుతూ, పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టేను స్వాగతించారు. ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కక్షసాధింపును ఎండగట్టిందని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఘోష్ కమిషన్ నివేదిక నిబంధనలకు విరుద్ధంగా ఉందని బీఆర్ఎస్ ముందే చెప్పిందని, ఇప్పుడు అదే నిజమైందని తెలిపారు.మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న పిల్లర్లను వెంటనే మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలు ముఖ్యమని ప్రభుత్వం భావించడం దురదృష్టకరమని విమర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, మాజీ సర్పంచ్ చిందం రమేష్, కమల్ గౌడ్ పాల్గొన్నారు.

## బస్టాండ్ల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్త్

**ఆర్టీసీ సేవలు అంతరాయం లేకుండా కొనసాగాలి**

**ఎస్పీ. డి . వి. శ్రీనివాస రావు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సమ్మె నేపథ్యంలో మెదక్ జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ప్రజా రవాణా సేవలు నిరంతరంగా కొనసాగేందుకు భద్రతా చర్యలను బలోపేతం చేసింది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. డిపో మేనేజర్ సురేఖతో మాట్లాడిన ఎస్పీ, ప్రస్తుతం నడుస్తున్న బస్సుల సంఖ్య, సేవల స్థితిగతులను తెలుసుకున్నారు. సమ్మె ఉన్నప్పటికీ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా రవాణా సేవలు సజావుగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్టాండ్ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రైవేట్ డ్రైవర్లు, సిబ్బంది భయపడాల్సిన అవసరం లేదని, వారికి పూర్తి భద్రత కల్పిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. ప్రజా రవాణాకు ఆటంకం కలిగించే చర్యలు, బస్సులకు నష్టం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాన్ని సహించబోమని హెచ్చరించారు. అటువంటి ఘటనలు జరిగితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా ఎస్పీ వెంట డియస్పీ ప్రసన్న కుమార్, డిపో మేనేజర్ సురేఖ, సీఐలు మహేష్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన గ్రామ సర్పంచ్ సుజాత, ఎంపీడీవో ఉన్నీసా



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును గురువారం నాడు గ్రామ సర్పంచ్ కన్నబోయిన సుజాత ఆధ్వర్యంలో కొల్చారం ఎంపీడీవో ఉన్నిసా రిబ్బన్ కట్ చేశారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు నిరుపేదలకు ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కోసం కలలు కంటున్నా కుటుంబాల వారికి ఈ పథకం ద్వారా ఈ కల నెరవేరుతుందని వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ కన్నబోయిన సుజాత తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఈ సుష్మ, పంచాయతి సెక్రటరీ సంధ్య ఉప సర్పంచ్ సత్యం, ఫిల్డ్ అసిస్టెంట్ లక్ష్మి, వార్డు మెంబర్స్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అనాథ శరణాలయం నిర్మాణానికి సీఐ రవికుమార్ విరాళం



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో "నేను సైతం రండి సమాజానికి సేవ చేద్దాం" చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించబడుతున్న అనాథ శరణాలయ భవనానికి గజ్వేల్ సీఐ రవికుమార్ రూ.10,000 విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేదల కోసం సర్దార్ పంజాల వెంకట్ గౌడ్ తన సొంత స్థలంలో అనాథ శరణాలయం నిర్మించాలన్న ఆలోచన అభినందనీయమని పేర్కొన్నారు.ట్రస్ట్ చైర్మన్ సర్దార్ పంజాల వెంకట్ గౌడ్ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణలోనే కాకుండా ప్రజా సేవలో కూడా ముందుండే సీఐ రవికుమార్, ఈ విరాళంతో తన సేవాభావాన్ని చాటుకున్నారని అన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలే లక్ష్యం

### తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి





మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు.గురువారం మెదక్ జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో విత్తన డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు, ఎఫ్‌పీఓలు (ఖ్రీూం) మరియు ఏఆర్ఎస్‌కే (ూాాఖ) కేంద్రాల ప్రతినిధులతో నిర్వహించిన విస్తృత స్థాయి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నేరుగా రైతులతో అనుసంధానమై, వారి ద్వారానే విత్తన ఉత్పత్తి చేపడుతుందని చైర్మన్ తెలిపారు. సేకరించిన విత్తనాలను కఠినమైన ప్రమాణ పరీక్షల అనంతరం ధృవీకరించి మాత్రమే రైతులకు అందజేస్తున్నామని అన్నారు. దీనివల్ల రైతులకు నాణ్యతపై పూర్తి భరోసా ఉంటుందని వివరించారు.వానకాలం సీజన్‌కు విత్తనాలు సిద్ధం ప్రస్తుత వానకాలం (ఖరీఫ్) సీజన్‌కు సంబంధించి జిల్లాలో విత్తనాల కొరత లేదని ఆయన స్పష్టం చేశారు.సన్న రకాలు: బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638.దొడ్డు రకాలు: కెఎన్ఎం 118, ఎమ్‌టియు 1010.పై రకాల విత్తనాలు నిల్వలో సమృద్ధిగా ఉన్నాయని, ప్రభుత్వం సూచించిన రకాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని ఆదేశించారు. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలను కూడా సకాలంలో రైతులకు అందజేస్తామని పేర్కొన్నారు.సహకార సంఘాల పాత్రపై సూచనలు సహకార సంఘాలు, ఏఆర్ఎస్‌కే కేంద్రాలు కేవలం రాయితీ ఉన్న పచ్చిరొట్ట విత్తనాలపైనే కాకుండా, ఇతర పంటల విత్తనాలను కూడా రైతులకు అందించడంలో చొరవ చూపాలని కోరారు. లైసెన్స్ కలిగిన ప్రతి విత్తన డీలర్ విత్తనాభివృద్ధి సంస్థ ఉత్పత్తులను తప్పనిసరిగా విక్రయించాలని సూచించారు.మెదక్ జిల్లా సాగు అంచనాలు మెదక్ జిల్లాలో ఈ సీజన్‌లో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా వేస్తున్నామని, అందుకు 82 వేల క్వింటాళ్ల విత్తనం అవసరమని తెలిపారు. ఇందులో కనీసం 40 వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం ద్వారా సరఫరా చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే నూతన విత్తన చట్టం ద్వారా రైతుల హక్కులతో పాటు, డీలర్ల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కాపాడుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విత్తనాలను రైతులు కొనుగోలు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని విత్తన సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి నిత్యానంద్ , జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పి ప్రభాకర్ రెడ్డి ఏడీఏలు, ఎంఏఓలు, జిల్లా సహకార అధికారి (ణజూ), విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు, విత్తన డీలర్లు మరియు ఎఫ్‌పీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల డిమాండ్ లు పరిష్కరించాలి

### మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ఆర్టీసీ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడిచిపెట్టి తక్షణమే చర్చలు ప్రారంభించి, కార్మికుల అన్యాయమైన డిమాండ్ లను పరిష్కరించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ డిమాండ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మెదక్ ఆర్టీసీ డిపో గుల్షన్ క్లబ్ వద్ద కొనసాగుతున్న కార్మికుల రెండొవ రోజు సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ఆర్టీసీ కార్మికులతో కలసి ర్యాలీగా డిపో వరకు వెళ్లి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ హామీలు అన్ని గంగలో కలిసాయని,ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తీవ్రంగా విమర్శించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పుడు అమలు కాకుండా తూతూమంత్రంగా పరిపాలన సాగుతోందని, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విమర్శలు గుప్పించారు.ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సమ్మె కొనసాగడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. గతంలో . మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ, సరైన గుర్తింపు ఇచ్చి గౌరవాన్ని కాపాడారని గుర్తు చేశారు.ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రభుత్వంలో విలీనం, పీఆర్సీ ఫిట్‌మెంట్ వంటి హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. దీనివల్ల కార్మికులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు టెంట్లు వేసుకుని సామరస్యంగా సమ్మె కొనసాగిస్తున్నప్పటికీ, మెదక్ ప్రాంతంలో మాత్రం పోలీసులు కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా మహిళా కార్మికులను కూడా పట్టించుకోకుండా అరెస్టు చేసి పాపన్నపేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించడం తీవ్రంగా ఖండించారు.అరెస్టు చేసిన కార్మికులను వెంటనే విడుదల చేయాలని, వారి న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు పూర్తి స్థాయి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా వాయిదాలు వేయడం వల్ల కార్మికుల్లో ఆందోళన పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థకు వెన్నెముకలైన ఆర్టీసీ కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం తగదని, ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.ఉద్యోగాల భర్తీ, బకాయిల చెల్లింపు, సంఘ ఎన్నికల నిర్వహణ, ఔట్‌సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్ వంటి కీలక డిమాండ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులు సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నప్పటికీ వారికి సరైన హక్కులు, భద్రత కల్పించకపోవడం అన్యాయమని విమర్శించారు. వారి శ్రమ దోపిడీని అరికట్టి తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీ గడువు కోరడం సమ్మెను నీరుగార్చే ప్రయత్నంగా కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ విధమైన ఆలస్యం సమస్యలను మరింత సంక్లిష్టం చేస్తుందన్నారు. కమిటీలు, నివేదికల పేరుతో కాలయాపన చేయకుండా ప్రత్యక్షంగా కార్మిక సంఘాలతో చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.సమ్మె కారణంగా సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం దెబ్బతింటోందని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ కూలీలు ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే చర్చలు ప్రారంభించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు సంస్థ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సంక్షేమం కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను అంగీకరించి సమ్మెను విరమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ మల్లికార్జున్ గౌడ్,జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యం.లావణ్య రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి,న్యాయవాది జీవన్ రావు,పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు సోహెల్ జుబేర్ దీపక్ కుమార్, మెదక్ మాజీ వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు గడ్డమీద కృష్ణ గౌడ్,లింగారెడ్డి,సురేందర్ గౌడ్, వెంకటేశం,కాశినాథ్ రావు, అంజి రెడ్డి, వేణు,సాయికుమార్, రంజిత్, స్వామి నాయక్, యంబిపూర్. మహేష్ చంద్ పాషా, ఆర్టీసీ జేఏసీ జేఏసీ నాయకులు ఏంఆర్కే రావు, ఆర్టీసీ కార్మికులు,సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు..

## పెళ్లిరోజున పర్యవరణంపై చైతన్యం కల్పించిన జోగినిపల్లి రవీందర్ రావు - శశికళ దంపతులు

**- బీఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా జోగినిపల్లి దంపతుల పెళ్లిరోజు వేడుకలు**



కరీంనగర్ /బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్ రావు - శశికళ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని శ్రీపురం కాలనీలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమ నివాసంలో చొప్పదండి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో పాటు బిఆర్ఎస్ పార్టీ నాయకుల సమక్షంలో మొక్కను నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య,మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్, మాజీ మండల అధ్యక్షుడు మెడుదుల మల్లేశం, కొండగట్టు మాజీ డైరెక్టర్ ముద్దం రవీందర్ గౌడ్,కిషన్, తిరుపతి,అనిల్,మధు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సభ్యుడు కమల్ గౌడ్ తదితర నాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని,పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆర్టీసీ సమ్మెకు సంఘీభావం తెలిపిన వంటేరు ప్రతాప్ రెడ్డి



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికుల ఆహ్వానం మేరకు రెండో రోజు కొనసాగుతున్న నిరావధిక సమ్మెకు గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. గతంలో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మికులను పోలీసుల ద్వారా అడ్డుకోవడం, టెంట్లు తొలగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. ఉచిత బస్సు సేవలను ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం, డ్రైవర్లు, కండక్టర్లు కష్టాలను పట్టించుకోవడం లేదని అన్నారు. అధిక ప్రయాణికులతో సేవలందిస్తున్న కార్మికులపై లాఠీచార్జ్ చేయడం, అరెస్టులు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రైవేట్ బస్సులను ప్రవేశపెట్టడం ద్వారా ఆర్టీసీ కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నారని, వాటి వల్ల జరిగే ప్రమాదాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వం అయినా కార్మికులతో విభేదించి ఎక్కువ కాలం నిలవలేదని పేర్కొంటూ, వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆర్టీసీ కార్మికులకు పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# 'మెన్షన్ హౌస్ మల్లేశ్' మూవీ రివ్యూ!



మాగంటి శ్రీనాథ్ హీరోగా రూపొందిన సినిమానే 'మెన్షన్ హౌస్ మల్లేశ్'. బాల సతీశ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకి రాజేశ్ నిర్మాతగా వ్యవహరించాడు. కథానాయికగా ఈ సినిమాతో గాయత్రి రమణ పరిచయమైంది. మార్చి 6వ తేదీన థియేటర్లకు ఈ సినిమా వచ్చింది. పెద్దగా పబ్లిసిటీ లేకపోవడం వలన, ఆడియన్స్ కి రీచ్ కాలేకపోయింది. అలాంటి ఈ సినిమా, ఈ రోజు నుంచి 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. 'యాదగిరిగుట్ట'లో 2004వ సంవత్సరంలో ఈ కథ మొదలవుతుంది. భిక్షపతి - శంకరమ్మ సంతానంగా మల్లేశ్ ఉంటాడు. భిక్షపతి ఎప్పుడు చూసినా తాగడం .. మల్లేశ్ ను కొట్టడం చేస్తుంటాడు. దాంతో తండ్రిపై ద్వేషం పెంచుకుని ఇల్లొదిలి వెళ్లిపోయిన మల్లేశ్, తండ్రి చనిపోయిన తరువాతనే తన ఊరికి తిరిగొస్తాడు. తాగుడికి బానిసైన అతనికి, సాధ్యమైనంత త్వరగా పెళ్లి చేయాలని తల్లి ఆరాటపడుతూ ఉంటుంది. అలా మొత్తానికి 'జ్యోతి' (గాయత్రి రమణ)తో పెళ్లిజరిపిస్తుంది. ఆ ఊరికి కేశవ పెద్ద మనిషిగా వ్యవహరిస్తూ ఉంటాడు. అతని భార్యనే పద్మావతి (కామాక్షి భాస్కర్ల). కేశవను అందరూ చిన్నపటేల్ అని పిలుస్తుంటారు. పెద్ద పటేల్ కి ఒక మనవడు కేశవ అయితే .. మరో మనవడు మల్లేశ్ అన్నమాట. తమకి ఇష్టం లేని వ్యక్తిని పెళ్లి చేసుకున్న కారణంగా మల్లేశ్ తల్లిని పెద్ద పటేల్ కుటుంబం దూరం పెడుతుంది. చిన్నపటేల్ పది ఎకరాల భూమి మధ్యలో, మల్లేశ్ కి సంబంధించిన పది గుంతల భూమి ఉంటుంది. ఆ భూమిని సొంతం చేసుకోవడానికి చిన్నపటేల్ ప్రయత్నిస్తూ ఉంటాడు. మల్లేశ్ ఫస్టు నైట్ వృథాగా గడిచిపోతుంది. అతను విపరీతంగా ఆల్కాహాల్ తీసుకోవడమే అందుకు కారణమని డాక్టర్లు చెప్పడంతో షాక్ అవుతాడు. మల్లేశ్ దగ్గర విషయం లేదనే సంగతి చిన్న పటేల్ కి తెలుస్తుంది. అప్పుడు అతను ఏం చేస్తాడు? మల్లేశ్ భూమిని కాజేయాలనే అతని ప్లాన్ ఫలిస్తుందా? మల్లేశ్ తన బలహీనతను జయించగలుగుతాడా? అనేది మిగతా కథ. గ్రామాలలో పొలం తగాదాలు .. గట్టు పంచాయితీలు చాలా సహజంగా కనిపిస్తూ ఉంటాయి. వారసుల మధ్య ఈ గొడవలు ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. అవతలివారి బలహీనతలపై దెబ్బకొట్టేసి, తమకి కావలసిన దానిని సొంతం చేసుకోవాలనే ఆలోచన కొంతమందిలో సహజంగానే కనిపిస్తూ ఉంటుంది. అలాంటి ఒక ప్రధానమైన అంశాన్ని ఎంచుకుని దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు.ఒక గ్రామం .. రెండు కుటుంబాలు .. ఆ రెండు కుటుంబాలు విడిపోవడానికి కారణమైన ఒక బలమైన సంఘటన .. ఆ ద్వేషాన్ని ఇప్పటికీ కొనసాగిస్తూనే ఉన్న పొలం తగాదా ఈ కథలో ప్రధానమైనవిగా మనకి కనిపిస్తాయి. ఈ ఘర్షణకు .. సంఘర్షణకు ప్రతీకలుగా మల్లేశ్ - చిన్నపటేల్ పాత్రలుఘను మలిచారు. చాలావరకూ ఈ కథ, ఈ రెండు పాత్రల చుట్టూనే తిరుగుతూ ఉంటుంది. ఆస్తుల కోసం చిన్నపటేల్ ఆలోచన చేయడం .. ఆచరణలో పెట్టడం ద్వారా ఆయనలోని విలనిజాన్ని ఆవిష్కరించారు. ఇక పిల్లల కోసం మల్లేశ్ ఆరాటపడటం .. అందుకోసం చేసే ప్రయత్నాలు కాస్త ఫన్నీగా అనిపిస్తాయి. ఈ రెండు ట్రాకులే ఈ కథలో ప్రాధాన్యతను సంతరించుకుని కనిపిస్తాయి. చివరికి చిన్నపటేల్ విసిరే ఛాలెంజ్ తో కథ నెక్స్ట్ లెవెల్ కి చేరుకుంటుంది.హీరో అల్లరిచిల్లరగా పెరగడం .. బుట్టలు బుట్టలుగా సీసాలు పేరుకుపోయే స్థాయిలో తాగేయడం .. స్నేహితులతో కలిసి తిరిగేయడం .. పేరుకి ఒక టెంట్ హౌస్ నడుపుతూ ఉండటం .. ఎవరైనా ఏదైనా అంటే వెంటనే గొడవకి వెళ్లడం వంటి రొటీన్ సీన్స్ తోనే ఈ కథ ముందుకు వెళుతూ ఉంటుంది. ఈ పాయింట్ ఏదో కొత్తగా ఉందే .. నెక్స్ట్ ఏమౌతుందో అనే ఉత్కంఠ మాత్రం ఉండదు. రొమాన్స్ .. కామెడీ .. ఎమోషన్స్ ప్రధానంగా ఈ సినిమా నడుస్తుంది. హీరో - హీరోయిన్స్ మధ్య నడిచే రొమాన్స్, మల్లేశ్ స్నేహితులైన సుధాకర్ రెడ్డి .. వీరబాబు పాత్రల ద్వారా కామెడీ వర్కౌట్ చేయడానికి చేసిన ప్రయత్నం కొంతవరకూ అలరిస్తుంది. ఎటొచ్చి ఎమోషన్ అనేది ఏ మాత్రం పండలేదు. బలంగా ఉంటుందనుకున్న ఫ్లాష్ బ్యాక్ కి కామెడీ టచ్ ఇచ్చేసి బలహీనంగా మార్చేశారు. ద హీరో తన చిన్నప్పుడు తండ్రిపై కోపంతో, అతను తాగే మందులో మూత్రం పోయడం, పెద్దయిన తరువాత తన తండ్రి ఫోటోపై చెడ్డీ ఆరేయడం కాస్త గీత దాటినట్టుగా అనిపిస్తుంది. మాగంటి శ్రీనాథ్ .. గాయత్రి రమణ నటన బాగానే ఉంది. మురళీధర్ గౌడ్ .. కామాక్షి భాస్కర్ల వంటి ఆర్టిస్టులకు సరైన పాత్రలు పడలేదనే అభిప్రాయం కలుగుతుంది. అమ్మ ముత్తు ఫొటోగ్రఫీ .. గ్యారీ బీ హెచ్ ఎడిటింగ్ .. సురేశ్ బొబ్బిలి సంగీతం కథకి తగినట్టుగానే కనిపిస్తాయి. ఎలాంటి ట్విస్టులు లేకుండా .. రొటీన్ గా సాగిపోయే ఈ సినిమా, ఓ మాదిరిగా అనిపిస్తుంది అంతే.

# నేను నటిని..

### కంటెంట్ క్రియేటర్‌ని కాదు: శివాత్మిక రాజశేఖర్

ప్రముఖ సినీ నటులు రాజశేఖర్, జీవితల కుమార్తె శివాత్మిక ఇండస్ట్రీలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... నెపోటిజం, సినిమా అవకాశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. రాజశేఖర్ కూతురిగా దర్శకులను కలిసే అవకాశం తనకు సులభంగా రావొచ్చు కానీ, ప్రతిభ ఉంటేనే ఇండస్ట్రీలో నిలబడగలమని ఆమె స్పష్టం చేసింది. తనకు 'రంగమార్తాండ'లో అవకాశం రావడానికి 'దొరసాని'లోని తన నటనే కారణమని గుర్తు చేసింది. తాను రాజశేఖర్ కూతురిని అని తెలిసి కూడా కొన్ని ప్రాజెక్టుల నుంచి తనను తప్పించారని, దానికి కారణం తనకంటే మరొకరికి సోషల్ మీడియాలో ఎక్కువ మంది ఫాలోవర్లు ఉండటమేనని వెల్లడించింది. "నేను ఒక నటిని, కంటెంట్ క్రియేటర్‌ని కాదు. ఒక పాత్రకు నటి సెట్ అవుతుందా లేదా అని చూడాలి కానీ, ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్లను చూసి అవకాశాలు ఇవ్వడం ఏంటి?" అని ఆమె పరిశ్రమ తీరును ప్రశ్నించింది.



# హీరోగా సత్య..

## నవ్వులే నవ్వులు పంచేలా 'జెట్లీ' ట్రైలర్!

స్టార్ కమెడియన్‌గా టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన సత్య, ఇప్పుడు హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జెట్లీ'. రితేశ్ రానా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు. పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ ట్రైలర్, చూసిన వారిని కడుపుబ్బా నవ్విస్తోంది. ట్రైలర్ ఆద్యంతం సత్య తనదైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్లు, పోస్టర్లు సినిమాపై ఆసక్తిని పెంచగా, ఇప్పుడు ట్రైలర్‌తో అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమాలో 2024 మిస్ యూనివర్స్ ఇండియా టైటిల్ విజేత రియా సింఘా హీరోయిన్‌గా నటించడం ఒక ప్రత్యేక ఆకర్షణ. ప్రముఖ నటులు వెన్నెల కిశోర్, వైవా హర్ష, అజయ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాకు కాల భైరవ సంగీతాన్ని అందించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'జెట్లీ' చిత్రం మే 1న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.




# వరుస ఫ్లాప్స్‌తో కెరీర్‌పై సందిగ్ధం..!

కన్నడ సినిమాలతో కెరీర్ ప్రారంభించి, టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. ప్రారంభంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని టాప్ హీరోయిన్ రేసులోకి వచ్చిన ఆమె... ఇప్పుడు మాత్రం వరుస ఫలితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు కనిపిస్తోంది. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి సందడి' సినిమాతో శ్రీలీల టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా... ఆమెకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. మొదటి సినిమా ఫ్లాప్ అయినా కూడా, ఇండస్ట్రీలో ఆమెకు వరుస అవకాశాలు రావడం విశేషం. రవితేజ సరసన నటించిన 'ధమాకా' సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో శ్రీలీల కెరీర్ ఒక్కసారిగా టర్న్ అయింది. ఆ విజయంతో ఆమె టాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. వరుసగా అరడజను సినిమాలు ఆమె చేతిలో పడగా, కొన్నింటి ఫలితాలు నిరాశపరిచాయి. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, పెద్ద హిట్ మాత్రం ఆమెకు దక్కలేదు. 'పుష్ప 2'లో చేసిన ప్రత్యేక డాన్స్ నంబర్‌తో ఇతర భాషల ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు తమిళ, హిందీ ఇండస్ట్రీల్లో అవకాశాలు కూడా వచ్చాయి. తమిళంలో చేసిన 'పరాశక్తి' సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైంది. దీంతో అక్కడ ఆమెకు ఆశించిన గుర్తింపు రాలేదు. ఇక హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో చేస్తున్న సినిమా ఆలస్యం అవుతుండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత లేకపోవడం గమనార్హం. ఇటీవల వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్ సరసన నటించినా... సినిమాలో ఆమె పాత్రకు పెద్దగా గుర్తింపు రాలేదు. అదే సమయంలో గత ఏడాది వచ్చిన సినిమాలు కూడా కమర్షియల్‌గా పెద్ద విజయాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుతం తెలుగులో పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడంతో, శ్రీలీల తన భవిష్యత్తును బాలీవుడ్ సినిమాపైనే ఆధారపెట్టినట్టు కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఓ సినిమాలో ఆమెకు అవకాశం వచ్చిందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ సంవత్సరం శ్రీలీల కెరీర్‌కు అత్యంత కీలకం. కనీసం ఒకటి రెండు హిట్స్ సాధిస్తేనే ఆమె మళ్లీ టాప్ రేసులోకి రావచ్చని అంటున్నారు.



# బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న 'భూత్ బంగ్లా'

చాలా కాలం తర్వాత బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ తన పాత ఫామ్‌లోకి వచ్చారని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఏప్రిల్ 17న విడుదలైన 'భూత్ బంగ్లా' సినిమా మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. పెయిడ్ ప్రివ్యూల ద్వారానే రూ. 3.50 కోట్లు రాబట్టిన ఈ చిత్రం, తొలిరోజే రూ. 12.25 కోట్ల నెట్ కలెక్షన్స్ సాధించడం విశేషం. వీకెండ్ ముగిసే సరికి దేశవ్యాప్తంగా రూ. 58 కోట్లు వసూలు చేసిన ఈ సినిమా, సోమవారం కొంత మందగించినా మంగళవారం మళ్లీ పుంజుకుని రూ. 8 కోట్లు రాబట్టింది. దీంతో ఐదు రోజుల్లోనే భారతీయ బాక్సాఫీస్ వద్ద మొత్తం రూ. 72.75 కోట్ల నెట్ (రూ. 86.62 కోట్ల గ్రాస్) కలెక్షన్స్‌ను నమోదు చేసింది.దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లో కూడా 'భూత్ బంగ్లా' మంచి జోరు చూపిస్తోంది. ఐదు రోజుల్లోనే 3 మిలియన్ డాలర్ల మార్క్‌ను దాటేసి, ప్రపంచవ్యాప్తంగా రూ. 118 కోట్ల గ్రాస్ వసూళ్లు నమోదు చేసింది. ఇదే ట్రెండ్ కొనసాగితే రెండో వారాంతానికి రూ. 150 కోట్ల క్లబ్‌లోకి సునాయాసంగా చేరుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ చిత్రానికి పోటీగా 'ధురంధర్ 2' ఉన్నప్పటికీ, ప్రేక్షకులు అక్షయ్ స్టైల్ కామెడీకి పెద్ద పీట వేస్తున్నారు. ఈ ఏడాది విడుదలైన హిందీ చిత్రాల్లో 'భూత్ బంగ్లా' ఇప్పటికే టాప్-3లో చోటు దక్కించుకుంది. షాహిద్ కపూర్, తమన్నా నటించిన 'ఓ రోమియో' (రూ. 92 కోట్లు), అలాగే రాణి ముఖర్జీ ప్రధాన పాత్రలో వచ్చిన 'మర్దానీ 3' (రూ. 78 కోట్లు) లైఫ్‌టైమ్ కలెక్షన్స్‌ను కేవలం ఐదు రోజుల్లోనే అధిగమించడం ఈ చిత్ర విజయాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది.ఇక హారర్ కామెడీ జానర్‌లో సంచలనం సృష్టించిన వరుణ్ ధావన్ నటించిన 'భేడియా' (రూ. 90 కోట్లు) రికార్డును కూడా ఈ చిత్రం దాటేసింది. త్వరలోనే 'ముంజ్యా' (రూ. 132 కోట్లు) కలెక్షన్స్‌పై కన్నేసింది. అలాగే 'స్త్రీ', 'భూల్ భూలయ్యా 2' వంటి సూపర్ హిట్ చిత్రాల సరసన నిలవడానికి సిద్ధమవుతోంది.దర్శకుడు ప్రియదర్శన్, అక్షయ్ కుమార్ కాంబినేషన్‌లో సినిమా వచ్చి దాదాపు 14 సంవత్సరాలు అవుతోంది. గతంలో 'భూల్ భూలయ్యా' వంటి క్లాసిక్ హిట్ ఇచ్చిన ఈ జోడీ, ఇప్పుడు 'భూత్ బంగ్లా'తో మరోసారి మేజిక్‌ను రిపీట్ చేసింది. ఈ చిత్రంలో టబు, వామికా గబ్బి కీలక పాత్రల్లో మెప్పించగా, పరేష్ రావల్, రాజ్‌పాల్ యాదవ్‌ల కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన బలం అయ్యింది. హారర్ ఎలిమెంట్స్‌కు వింటేజ్ కామెడీ జోడవడంతో ప్రేక్షకులు థియేటర్లకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.మొత్తంగా, అక్షయ్ కుమార్‌కు ఈ చిత్రం బలమైన కమ్‌బ్యాక్‌గా నిలుస్తోంది. వరుస ఫ్లాప్స్ తర్వాత మంచి విజయాన్ని అందుకోవడం ఆయన కెరీర్‌కు పెద్ద బూస్ట్‌గా మారింది.



# పది గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండలంలోని పది గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు ప్రారంభించారు. మండలంలోని పుట్టపాక, అక్కేపల్లి, నగరంపల్లి, మహబూబ్ పల్లి, మల్లేపల్లి, పోతారం, నాగారం, కన్నాల, గుంజపడుగు, సిరిపురం వరి ధాన్యం కేంద్రాలను సర్పంచులు కన్నూరి రాజబాపు, పెయ్యాల సంధ్య – సురేష్, నాతరి లత – శ్రీనివాస్, లక్కాకుల సత్యనారాయణ, ఎడ్ల ఆదిత్య, బెల్లంకొండ శ్రీదేవి – సత్యనారాయణ రెడ్డి, గుడిసె గట్టయ్య, దండవేన సంధ్య – భానేష్, గోదారి లక్ష్మీ లు ప్రారంభించారు. రైతులకు అందుబాటులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, ఏ ఏం సి వైస్ చైర్మన్ ముస్కుల ప్రశాంత్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్ రెడ్డి, నాయకులు పేరవేన లింగయ్య, ఊదరి శంకర్, కుంట రాజు, రాం రాజశేఖర్, బూడిద శంకర్, ఎడ్ల శ్రావణ్, కన్నూరి సుదర్శన్, చాట్లపల్లి మధు, సంతోష్, ఆకుల సురేష్, అయిలి సతీష్, పోరెడ్డి జ్ఞానప్రసన్న – తిరుపతి రెడ్డి, నౌండ్ల సదానందం, కన్నూరి రజిత – సంతోష్, గువ్వల ప్రశాంత్, కొవ్వూరి శైలజ, గోష్కి శంకర్, ఎరుకల మోహన్ సాయి, ఎడ్ల సత్యనారాయణ, దాసరి గట్టయ్య, దాసరి లక్ష్మీ, ఎరుకల లలిత – వెంకటస్వామి, భాస్కర్ రెడ్డి, పోయిల రాజయ్య, గాదె దివ్య, కావటి రజిత, గాదె సంజీవ రెడ్డి, పాపిరెడ్డి, సంతోష్ రెడ్డి, గుర్రాల రాజలింగు, బొల్లి శంకర్, సమ్మయ్య, మిటుకు రామ్మూర్తి,గోదారి మహేందర్, రైతులు, ప్రజాప్రతినిధులు, హమాలీ సంఘం నాయకులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలి

- పీఎఫ్, సీసీఎస్ బకాయిలు వెంటనే చెల్లించాలి
- ఆర్టీసీ సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు
- ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి : కడారి రాములు



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ బస్ డిపో వద్ద రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన ఆర్టీసీ సమ్మెలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆర్టీసీ కార్మికుల పక్షాన తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంబంధించిన పీఎఫ్,సీసీఎస్ బకాయిలను ఆలస్యం లేకుండా చెల్లించాలని స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేట్ సంస్థలకు కాకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి ఇవ్వాలని, వాటిని ఆర్టీసీ కార్మికులతోనే నడిపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు పూర్తి స్థాయి పని భద్రత కల్పించాలని, పెండింగ్ సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించి అన్ని సమస్యలను పరిష్కరించాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే మరింత తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.వి. అనసూయ,గాజుల పోశయ్య,పందుల మల్లేష్, ముఖ్య రమేష్,గంగయ్య, పండుగ చంద్రయ్య, పెంట శీను,గాజుల మల్లయ్య, చంద్రయ్య తదితర కార్మిక సంఘం నాయకులు,ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీపై ఖర్గే అనుచిత వ్యాఖ్యలపై అనుమల్ల చంద్రమౌళి తీవ్ర ఆగ్రహం

- కాంగ్రెస్ దిగజారుడు రాజకీయలకు ఖర్గే వ్యాఖ్యలు నిదర్శనం
- ఖర్గే భేషరతుగా క్షమాపణలు చెప్పాలి
- భాజపా కరీంనగర్ జిల్లా సీనియర్ నేత, కొత్తపల్లి మాజీ ఉప సర్పంచ్ : అనుమల్ల చంద్రమౌళి



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీజేపీ కరీంనగర్ జిల్లా సీనియర్ నాయకుడు, కొత్తపల్లి మాజీ ఉప సర్పంచ్ అనుమల్ల చంద్రమౌళి తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పూర్తిగా ఖండనీయమని అన్నారు. దేశాన్ని ప్రపంచ వేదికపై ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న నాయకుడిని ఉగ్రవాదిగా పేర్కొనడం కాంగ్రెస్ పార్టీ రాజకీయ సంస్కృతి ఎంత దిగజారిందో తెలియజేస్తుందని విమర్శించారు. ఓట్ల కోసం వ్యక్తిగత విమర్శలకు దిగడం సరైన రాజకీయ పద్ధతి కాదని, ఇలాంటి వ్యాఖ్యలను ప్రజలు సహించబోరని ఆయన హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు దేశ ప్రజల భావాలను దెబ్బతీసేవని పేర్కొంటూ, ఖర్గే వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని అనుమల్ల చంద్రమౌళి డిమాండ్ చేశారు.

# రేవంత్‌రెడ్డి అహంకారానికి హైకోర్టు తీర్పు పరాకాష్ట...

- ఒర్రుడు..అబద్దాలు మాని పరిపాలనపై దృష్టి పెట్టాలే
- కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్దరణ బాధ్యత దుద్దిళ్ల తీసుకోవాలే
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





మంథని ( ప్రశ్న న్యూస్) రేవంత్ రెడ్డి అహంకారానికి హైకోర్టు తీర్పు పరాకాష్టగా నిలుస్తుందని, ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ కళ్లు తెరువాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంథని పట్టణంలోని రాజగృహాలో హైకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు తీర్పు తర్వాత పీసీ ఘోష్ కమీషన్ రిపోర్ట్ పీసీసీ స్ట్రిఫ్‌గా నిర్ధారించబడిందని అన్నారు. రేవంత్‌రెడ్డి గొంతుపెద్దగా ఉందని ఒర్రుడు బంద్ చేసి అబద్దాలు ఆడుడు మానేసి పరిపాలనపై దృష్టి పెట్లాలని ఆయన డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా అడ్డూఅదుపు లేకుండా ఒర్రిన సీఎం రేవంత్‌రెడ్డి హైకోర్టు తీర్పుతోనైనా కళ్లు తెరువాలని ఆయన అడుగులకు మడుగులు ఒత్తే మంథని ఎమ్మెల్యే కళ్లు తెరుస్తాడని బావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఏదైనా ప్రాంతానికి ప్రాజెక్టు వస్తే ఆహ్వానించాల్సిన ఆ ప్రాంత ప్రతినిధి కాళేశ్వర ప్రాజెక్టును వ్యతిరేకించడం దుర్మార్గం దౌర్భాగ్యమన్నారు. దాంట్లో ముందు వరుసలో దుద్దిళ్ల శ్రీధర్ నిలబడటం ఆశ్చర్యకరమన్నారు. 150 కిలోమీటర్ల విస్తీర్ణంలో నియోజకవర్గంలోనే నీళ్లు నిలబడి ఉంటున్న ఇంత పెద్ద ప్రాజెక్టుతో పశ్చమ తూర్పు గోదావరిని తలపించే విధంగా ఈ ప్రాంతం మారుతున్న క్రమంలో ఇద్దరు ఐరల్ లెగ్‌లు రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌లు అధికారంలోకి వచ్చి కళ్లలో కారం పోసుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఆనాడు తమ్మడిశెట్టి వద్ద ప్రాజెక్టు కడితే బాగుంటదని మాట్లాడిన నాయకులు మూడేళ్లయినా ప్రతిపాదన చేయలేదని తట్టెడు మట్టి తీయలేదన్నారు. తమ్మిడిశెట్టి నుంచి మేడిగడ్డకు కేసీఆర్ ఒకరి ఆలోచన కాదని, క్యాబినెట్ నిర్ణయంతో పాటు ఇంజనీరింగ్ నిపుణుల కమిటి లోతైన అధ్యయనం చేసి రిపోర్ట్ ఇచ్చిన తర్వాతనే కేసీఆర్ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద బ్యారేజీ మొదలు పెట్టిందని హైకోర్టు తేల్చి చెప్పిందని, ఈ విషయంలో ఇకనైనా అజ్ఞానులకు జ్ఞానం రావాలని ఆయన కోరుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై చేస్తున్న దుష్ప్రచారంపై హైకోర్టు కుడా మందలించిందని, కేసీఆర్ అనుమతి లేకుండా ఆయనను అబాసుపాలు చేసేలా దుష్ప్రచారం చేయడం చట్ట విరుద్దమని, కేసీఆర్, హరీష్‌రావుతో పాటు ఆనాడు పని చేసిన అధికారులను బదనాం చేయడం కూడా చట్ట విరుద్దమని హైకోర్టు చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు. హైకోర్టు తేల్చి చెప్పినా సీఎం రేవంత్‌రెడ్డి కళ్లు తెరువడని, అందుకే రేవంత్‌రెడ్డి బ్యాచ్‌ను దండుపాళం బ్యాచ్ అని కేటీఆర్ అన్నడన్నారు. కాళేశ్వరం పూర్తిగా కొట్టుకుపోయిందని బదనాం చేసినోళ్లు ఈనాడు మేడిగడ్డకు కాన్వాయ్‌తో బ్యారేజ్‌మీద నుంచి పోయి పగుళ్లను చూసి వచ్చి మళ్లీ సభలో మేడిగడ్డ కూలిపోయిందని అనడం హస్యాస్పదన్నారు. రేవంత్‌రెడ్డి కళ్లున్న కబోదిలా మాట్లాడుతున్నాడని అన్నారు. మూడు సార్లు బారీ వర్షాలు, లక్ష క్యూసెక్కుల వరద నీటి తట్టుకుని నిలబడ్డదని, కుంగిపోయింది కానీ ఇంత పెద్ద వరదలు వచ్చినా ఇంచు కదలలేదని ఆయన తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బదనాం చేసిన కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త నుంచి కేసీఆర్ వరకు దుష్పచారం చేసి అదికారంలోకి వచ్చిండ్లని ఆయన అన్నారు. అయితే ఈసారి వర్షాలు తక్కువగా ఉంటయని నీళ్లకు ఇబ్బంది ఏర్పడుతుందని వాతావరణశాఖ హెచ్చరించినా కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు ఆపడం లేదని, ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్దరించి రైతులకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంత పెద్ద సమాజం ఓట్లు వేసి గెలిపిస్తే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఈ ప్రాంత ప్రజలు, రైతుల గురించి కనీసం ఆలోచన చేయడం లేదని, వ్యవసాయం, రైతులు అంటే ఆయనకు తెలియదని ఎద్దేవా చేశారు. అనేక ఏండ్లుగా మానేరు, గోదావరినది ద్వారా నీళ్లు వృదాగా పోతున్నా ఈ ప్రాంత ఎమ్మెల్యేగా పరివాహక ప్రాంతాలకు నీళ్లు అందించాలని ఏనాడు ఆలోచన చేయలేదని విమర్శించారు. హైకోర్టు తీర్పుతోనైనా రేవంత్‌రెడ్డి, ఆయన క్యాబినెట్ కళ్లు తెరువాలని, కాళేశ్వరం ప్రాజెక్టు అందరికి శ్రీరామ రక్ష అని గ్రహించి ప్రాజెక్టు పునరుద్దరణకు మంథని ఎమ్మెల్యే పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆర్టీసీ కార్మికులకు మద్దతు తెలిపిన. మంథని

- మాజీ ఎమ్మెల్యే. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- ఆర్టీసీ కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేర్చాలే.





మంథని ( ప్రశ్న న్యూస్) దేశంలో కనికరం లేని పార్టీ ఏదైనా ఉంటే అంటే అది కాంగ్రెస్ పార్టీనేనని, పాకిస్తాన్ తీవ్రవాదుల కంటే ప్రమాదకరమైందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు,. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన సంఘీబావం తెలుపుతూ గురువారం సమ్మె శిభిరాన్ని ఆయన భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్ తీవ్రవాదులు కనికరం చూపుతారేమో కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం కనికరం చూపదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు ఎలా ఉంటుందో అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ విధంగా ఉంటుందో చూస్తున్నామని అన్నారు. ఈనాడు ఇంత ప్రజా చైతన్యం, ఏఐ వస్తున్న క్రమంతో పాటు సోషల్ మీడియా ప్రభావం ఉన్నా కూడా కాంగ్రెస్ పార్టీ అవలీలగా అన్యాయం చేస్తుందన్నారు. కళ్ల ముందే అనేక అక్రమాలు, అన్యాయాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆనాడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీలో ఉన్నట్లుగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో మానీఫెస్టోలో అనేక అంశాలతో పాటు ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన అంశాలను పొందుపర్చి ఈనాడు వాటిని అమలు చేయకుండా తుంగలో తొక్కుతున్నారని అన్నారు. ప్రజాస్వామ్య రాజ్యాంగ బద్దంగానే పని చేస్తూ మన హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటంలో న్యాయ బద్ధత ఉందని, ఈ క్రమంలో పోలీసులు ఇబ్బంది పెట్టడం బాధాకరమని అన్నారు. మట్టిపనికైనా ఇంటోడు కావాలన్నట్లు మనల్ని పాలించే వారు కూడా మనోడే కావాలని ఆయన అన్నారు. ఆనాడు మానీఫెస్టోలో అనేక హామీలు ఇచ్చి మోసం చేసి అధికారంలోకి వచ్చారని, ఇందులో మంథని ఎమ్మెల్యే పాత్ర కీలకమైందన్నారు. దోచుకోవడం దాచుకోవడం...అధికారం పోతే కన్నీళ్లు పెట్టుకోవడం కాంగ్రెస్‌కు అలవాటేనని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ మూలాలను ఏనాడు మర్చిపోవద్దని, అవి ఎన్నటికి మారవని, వాళ్ల మాటలను నమ్మితే నట్టేట ముంచుతరని ముందే చెప్పారని ఆయన గుర్తు చేశారు. మూడు ఓట్లు లేని దుద్దిళ్ల కుటుంబంలో ఐదుసార్లు మంథని ఎమ్మెల్యేగా శ్రీధర్‌ను, ఆయన తండ్రిని మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి 40 ఏండ్లు అధికారం ఇస్తే ప్రజలను మోసం చేస్తున్న తీరును చూసే మానీఫెస్టో కమిటి చైర్మన్‌గా నియమించారని ఆయన విమర్శించారు. మానీఫెస్టో రాసి ఇటు మంథని నియోజకవర్గ ప్రజలతో పాటు యావత్ రాష్ట్ర ప్రజలను మోసం చేసిన చరిత్ర మంథని ఎమ్మెల్యేదని ఆయన అన్నారు. ఆనాడు మానీఫెస్టోలో ఆర్టీసీ కార్మికుల సంక్షేమాన్ని కోరుతూ ప్రభుత్వ అధికారులతో సమానంగా వేతనాలు ఇస్తమని, రెండు పీఆర్సీలు ఇస్తమని, యూనియన్‌లను పునరుద్దరిస్తమని అన్నారని, కానీ ఈనాడు మానీఫెస్టో కమిటి చైర్మన్‌కు ఆ హామీలు గుర్తుకు లేవని విమర్శించారు. మంథని ఎమ్మెల్యే చదువుకున్న వ్యక్తివి అయితే మానీఫెస్టోను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు...ఎన్ని రోజులైనా మీతో పాటే మేముంటాం...జక్కు శ్రీహర్షిణీ రాకేష్, జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ భూపాలపల్లి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె ఎన్ని రోజులు జరిగినా మీతో పాటే మేం అండగా ఉంటామని భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్ అన్నారు, మంథని ఆర్టీసీ డిపో ఎదుట సమ్మె చేపట్టిన కార్మికులకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌తో కలిసి ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంథని ఎమ్మెల్యే మానీఫెస్టో కమిటి చైర్మన్‌గా ఆర్టీసీ కార్మికులకు హమీలు ఇచ్చి అవి అమలు చేయడంలో విఫలం అయ్యాడని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులు ఏనాడు తమ సమస్యలు విన్నవించుకోలేదని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఆర్టీసీ కార్మికులకు హామీలు ఇచ్చి మోసం చేశారని అన్నారు. ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేలా గెజిట్ తీసుకువచ్చారని, 95శాతం పూర్తి కాగా మిగిలిన ఐదు శాతం పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఈనాడు మహలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆమె దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం అయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# రైతుల మద్దతు ధర కోసం కొనుగోలు కేంద్రాలే ఉత్తమం

- రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి
- బోయినిపల్లి ఏఎంసీ చైర్మన్
- బోయిని ఎల్లేష్ యాదవ్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పంటను దళారుల ద్వారా అమ్మకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షరీఫ్ మొయినుద్దీన్, ఎంపీడీఓ జయశీల, సొసైటీ ప్రత్యేక అధికారి గౌస్, వ్యవసాయ అధికారి ప్రణీత, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, వేసిరెడ్డి దుర్గారెడ్డి, నాయకులు కొప్పుల నగేష్, అక్కనపల్లి ఉపేందర్, ఎమిరెడ్డి సురేందర్ రెడ్డి తదితరులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### తిరిగి రేషన్ బియ్యం దందా ప్రారంభించిన

# చర్యలు ఎక్కడ.? మంత్రి వినోద్

- అక్రమ రేషన్ బియ్యం దందాపై అధికారుల నిర్లక్ష్యం ఎందుకు.?
- దాడులు చేయడం కేసులు పెట్టడం అంతా ఓ నాటకమా.?
- దాడులు చేసే రెండు రోజులకే తిరిగి ప్రారంభిస్తే మళ్ళీ దాడులు చేయరా.?
- మళ్లీ అక్రమ రేషన్ బియ్యం దందా చేస్తే వాళ్లపై పీడీ యాక్ట్ పెట్టాలన్న అవగాహన అధికారులకు లేదా.?
- అధికారులకు అన్ని తెలిసే అక్రమ రేషన్ బియ్యం జరుగుతోంది, కట్టడి ఎవరు చేయాలి.? మంత్రి వినోద్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రంగారెడ్డి జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం దందా మళ్లీ ఊపందుకోవడం అధికారుల పనితీరుపై అనుమానాలను రేకెత్తిస్తోంది. ఇటీవల సివిల్ సప్లై అధికారులు దాడులు నిర్వహించి భారీగా రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినప్పటికీ, కేవలం రెండు రోజుల వ్యవధిలోనే అదే ప్రాంతాల్లో తిరిగి అక్రమ




రేషన్ బియ్యం రవాణా ప్రారంభమవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ పరిణామాలపై టిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ జాయింట్ సెక్రటరీ మంత్రి వినోద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### దాడులు, సీజ్ చేయడం నాటకమా.?

రంగారెడ్డి జిల్లా ఆదిపట్లలోని మంగళపల్లి (బొంగులూరు గేటు) పరిసరాల్లోని గోదాముల్లో మళ్లీ అక్రమ బియ్యం వ్యాపారం యదేచ్ఛగా కొనసాగుతుండగా, తిరిగి దాడులు చేసి కఠిన చర్యలు తీసుకోకుండా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని మంత్రి వినోద్ ప్రశ్నించారు. దాడులు చేసి సీజ్ చేసిన బియ్యం ఎక్కడికి వెళ్తోంది.? అదే రేషన్ బియ్యం మాఫియా చేతుల్లోకి తిరిగి చేరుతోందా.? అంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. దాడులు చేసి ఫోటోలు తీసుకోవడమేనా.? లేక నిజంగా అక్రమ దందాను కఠినంగా అరికట్టడం లేదా.? అని ఆయన అధికారులను నిలదీశారు.

### కేసులు పెట్టినా మారని పరిస్థితి..

రేషన్ బియ్యం మాఫియా నిర్వాహకులు అక్రమ సొమ్ముతో కోట్లకు పడగలెత్తారు దానితో అధికారులు దాడులు చేసిన రెండు రోజుల నుండి తిరిగి ప్రారంభించడం అధికారులకు విలువ లేకుండా పోతోంది. దానితో కలెక్టర్ పర్మిషన్ తీసుకొని కఠిన కేసులు నమోదు చేయాలన్న చర్చ జరుగుతోంది. ఈ అక్రమ రవాణాలో ప్రధానంగా ఉన్న నిర్వాహకులు ప్రేమ్ కుమార్, నరేష్‌లపై ఇప్పటికే కేసులు నమోదు చేసినప్పటికీ, వారి






కార్యకలాపాల్లో ఎలాంటి మార్పు కనిపించకపోగా తిరిగి యదేచ్ఛగా అక్రమ రేషన్ రవాణాను రెండు రోజులకే ప్రారంభించడం అధికారులకు పనితనానికి సవాల్ విసిరినట్లు మారిందని మంత్రి వినోద్ అన్నారు. దీనితో రేషన్ బియ్యం మాఫియా పరిస్థితి ఎంత తీవ్రమైందో చూపుతుందన్నారు.

కేసులు పెట్టడమే కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, తిరిగి రేషన్ అక్రమ రవాణా ప్రారంభిస్తే వాళ్లపై పిడి యాక్ట్ కేసులు పెట్టాలని, రేషన్ బియ్యం అక్రమ రవాణా దందా పునరావృతం కాకుండా చూడాలని మంత్రి వినోద్ డిమాండ్ చేశారు.

### లంచాలే కారణమా.?

అధికారుల నిర్లక్ష్యం వెనుక అవినీతి ఉందా.? అన్న సందేహాన్ని మంత్రి వినోద్ బహిరంగంగా వ్యక్తం చేశారు. అక్రమ దందా ఇంత బహిరంగంగా జరుగుతున్నా రంగారెడ్డి జిల్లా సివిల్ సప్లై అధికారుల చర్యలు లేకపోవడం వెనుక "లంచాల వ్యవహారం" ఉందనే అనుమానాలు ప్రజల్లో పెరుగుతున్నాయని ఆయన అన్నారు. ఈ వ్యవహారంపై స్టేట్ విజిలెన్స్ అధికారులతో పారదర్శక దర్యాప్తు జరపాలని కోరారు.

### ఏసీబీ దాడులు చేయాలని డిమాండ్..

రంగారెడ్డి జిల్లా సివిల్ సప్లై అధికారులపై అవినీతి ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయని, వారి ఆస్తులపై ఏసీబీ దాడులు నిర్వహిస్తే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయని మంత్రి వినోద్ స్పష్టం




చేశారు. రంగారెడ్డి జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం రవాణా దందా జోరుగా సాగుతోందని దీని వెనుక అధికారుల హస్తం ఉందని అందుకోసమే రెండవసారి దాడులు చేయకుండా వాళ్లతో సహకరిస్తున్నారన్న అనుమానాలను మంత్రి వినోద్ వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై తక్షణం




స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### కఠిన చర్యలు తప్పనిసరి: మంత్రి వినోద్

రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అక్రమ రేషన్ బియ్యం రవాణా వల్ల ప్రభుత్వానికి, ప్రజలకు భారీ నష్టం కలుగుతుండగా, నిజంగా అవసరమైన పేదలకు సరఫరా దెబ్బతింటోంది. ఈ పరిస్థితుల్లో అధికారులు కఠిన చర్యలు తీసుకొని మాఫియాపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఈ దందా మరింత విస్తరించే ప్రమాదం ఉందని మంత్రి వినోద్ హెచ్చరించారు. అక్రమ రేషన్ బియ్యం దందాపై అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ నాయకుల ఆరోపణలు, ప్రజల ఆగ్రహం అన్ని కలిసి ఈ వ్యవహారాన్ని తీవ్రంగా మారుస్తున్నాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకుని బాధ్యులపై చర్యలు చేపడితేనే ఈ దందాకు చెక్ పడే అవకాశం ఉందని లేకపోతే "దాడులు చేసాం, సీజ్ చేసాం అయిన రెండు రోజులకే మళ్లీ దందా చేస్తున్నారు అనే అధికారుల మాటలు వింటూనే ఉంటాం ఎందుకంటే వాళ్ళ కనుసైగల్లో జరుగుతుంది కాబట్టి అని మంత్రి వినోద్ పేర్కొన్నారు.

# భారత్ గొప్ప దేశం

### - అంతలోనే మాటమార్చిన ట్రంప్!




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌ను 'గొప్ప దేశం' అని అభివర్ణిస్తూ, తనకు అక్కడ ఒక 'చాలా మంచి స్నేహితుడు (మోదీ)' ఉన్నారని ప్రశంసించారు. అయితే, భారత్‌ను 'నరక కూపం' (హెల్ హోల్) అంటూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలున్న పోడ్‌కాస్ట్‌ను రీపోస్ట్ చేసిన తర్వాత, ట్రంప్ నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం. ఇటీవల అమెరికన్ రేడియో హోస్ట్ మైఖేల్ సేవేజ్ తన పాడ్‌కాస్ట్‌లో భారత్, చైనాలను 'నరకకూపాలు'గా అభివర్ణించారు. అమెరికాలో జన్మస్థలం ఆధారంగా పౌరసత్వం (బర్త్‌రైట్ సిటిజన్‌షిప్) ఉండటాన్ని ఆసరాగా చేసుకుని, ఆయా దేశాల మహిళలు తొమ్మిదో నెల గర్భంతో అమెరికాకు వచ్చి పిల్లల్ని కంటున్నారని, తద్వారా సులువుగా పౌరసత్వం పొందుతున్నారని ఆయన ఆరోపించారు. భారతీయులను 'ల్యాప్‌టాప్‌లతో ఉన్న గ్యాంగ్‌స్టర్లు'గా ఆయన వ్యాఖ్యానించారు. ఈ పాడ్‌కాస్ట్ వీడియోను, ట్రాన్‌స్క్రిప్ట్‌ను ట్రంప్ తన సోషల్ మీడియాలో రీపోస్ట్ చేయడంతో పెద్ద దుమారం రేగింది. ఈ వివాదం నేపథ్యంలో ట్రంప్ భారత్‌పై తన వైఖరిని స్పష్టం చేసే ప్రయత్నం చేశారు. 'భారత్ ఒక గొప్ప దేశం. ఆ దేశ నాయకత్వంలో నాకు ఒక మంచి స్నేహితుడు ఉన్నారు' అని ట్రంప్ అన్నట్లు న్యూఢిల్లీలోని అమెరికా ఎంబసీ ప్రతినిధి క్రిస్టోఫర్ ఎల్మ్స్ తెలిపారు. ఈ వివాదంపై భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రంధీర్ జైస్వాల్ స్పందిస్తూ, "మేము కొన్ని నివేదికలు చూశాం, అంతకు మించి మాట్లాడడానికేమీలే దు" అని క్లుప్తంగా బదులిచ్చారు. అమెరికాలో వలస విధానాలు, బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌పై తీవ్రంగా చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. మొత్తంమీద, ఈ వివాదం ద్వారా చెలరేగిన దుమారాన్ని చల్లార్చేందుకే ట్రంప్ భారత్‌తో తన స్నేహాన్ని మరోసారి గుర్తుచేశారని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అమరావతి బిట్స్ క్యాంపస్‌లో క్వాంటం, ఏఐ

### - 2027 నుంచి అడ్మిషన్లు



అమరావతి (ప్రశ్న న్యూస్) రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ బిట్స్ పిలానీ క్యాంపస్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో బిట్స్ పిలానీ ప్రతినిధులు సమావేశమై క్యాంపస్ నిర్మాణ పురోగతిని వివరించారు. 2027 నుంచి అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించనున్నట్టు వారు ముఖ్యమంత్రికి తెలిపారు. రాజధానిలో నిర్మిస్తున్న ఈ క్యాంపస్‌ను ఒక 'ఐకానిక్, ఏఐ క్యాంపస్'గా తీర్చిదిద్దుతున్నామని ప్రతినిధులు వెల్లడించారు. ఇందులో క్వాంటం టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, క్వాంటం టెక్నాలజీ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. బిట్స్ పిలానీ అమరావతి క్యాంపస్‌ను మూడు దశల్లో నిర్మిస్తున్నామని, మొత్తం 10 వేల మంది విద్యార్థులు చదువుకునేలా దీనిని అభివృద్ధి చేస్తున్నామని ప్రతినిధులు వివరించారు. ఈ క్యాంపస్‌తో పాటు సంస్థ విస్తరణకు మొత్తం రూ.250 కోట్ల మేర వ్యయం చేయనున్నట్లు వారు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సమావేశంలో క్యాంపస్ నిర్మాణం, భవిష్యత్ ప్రణాళికలపై సమగ్రంగా చర్చించారు.

## నేటి నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు

### - సెలవులు ప్రకటిస్తూ తెలంగాణ విద్యాశాఖ ఉత్తర్వులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) విద్యార్థులందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే వేసవి సెలవుల సందడి తెలంగాణలో మొదలైంది. నేటి నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఏప్రిల్ 23 విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలన్నీ వేసవి సెలవుల కారణంగా మూతపడనున్నాయి. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు మొత్తం 50 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు ఉండనున్నాయి. జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు జరిగేవి, కానీ ఈ ఏడాది ఎండలు ఇప్పటికే 40 డిగ్రీలు దాటుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ముందస్తుగానే సెలవులు ప్రకటించింది.

# చాయ్ మే చోర్ వాలాకా గలత్ మసాలా

## సిటీలో క్రైం పై పోలీసుల నజర్

- నకిలీ చాయ్ పత్తా ముఠాను ఛేదించిన హైద్రాబాద్ ఆహార కల్తీ నిఘా విభాగం పోలీసులు
- చాయ్ పత్తి కల్తీ ముఠా 10మందిని హెచ్ పాస్ పోలీసులు అరెస్ట్
- 3000వేల కిలోల కల్తీ చాయ్ పత్తా తో పాటు,1500వందల కిలోల ఎక్సపైర్ అయిన చాయ్ పత్తి,100కిలోల నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్న హెచ్ పాస్ పోలీసులు
- వివరాలు వెల్లడించిన వైభవ్ గైక్వాడ్ (గోల్కొండ జోన్ డిసిపి)

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో సుమారు కోటి ముప్పై లక్షల జనాభా ఉన్నట్లు సమాచారం. పిల్లబాట నుంచి మొదలు కొని అంతర్గత రోడ్లు, జాతీయ రహదారులు పై లక్షల కొద్దీ "టీ"సెంటర్లు దర్శనమిస్తున్నాయి. వివిధ రకాల పేర్లతో "చాయ్ కేంద్రాల పేర్లు"చూసి,ఓ సారి టీ తాగాల్సిందే అంటూ ఓ రౌండ్ వేసేస్తున్నారు సిటిజన్లు. అదేదో సినిమాలో పాటలో హె భాయ్ చాయ్ చటుకునా తాగరా భాయ్ చాయ్ చమక్కులే చూడరా భాయ్. చాయ్ ఖరీదులో ఛీప్ రా భాయ్ అంటూ తెలుగు సినిమాలో రెండు తెలుగు రాష్ట్రాల్లో



రికార్డు సృష్టించిన పాట.మరో విషయం ఏమిటంటే బ్రిటిష్ వారు పోతూ పోతూ భారత పౌరులకు చాయ్ పరిచయం చేసిన విషయం విదితమే. అందుకనే తెలుగోడి మార్నింగ్ టీ అంటే అంతా ఆషా మాషి కాదు. వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కల్తీ చాయ్ మసాలా పొడి నగరంలో విక్రయిస్తున్నారు.పలు ఫిర్యాదులు రావడంతో రంగంలోకి దిగిన హైద్రాబాద్ సిటీ హెచ్ పాస్ టీం 15 ప్రాంతాలలో దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో నకిలీ చాయ్ పత్తా,నకిలీ నల్ల బెల్లం అధిక మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. చాయ్ పత్తా లో సీన్తటిక్ కలర్ లు కలిపి చిప్ చాయ్ పత్తా తయారీ చేసే ముఠాను పట్టుకున్న పోలీసులు. నగరంలో చాయ్ చాలా ప్రాధాన్యత చెందింది.కానీ హైదరాబాద్ మహానగరంలో మంచి చాయ్ పత్తా అమ్మే వ్యాపారులు ఉన్నారు.నకిలీ చాయ్ పత్తా తయారు చేసి అమ్మే జాదూ గాళ్లు ఉన్నారు, అస్సలు బ్రాండ్ చూపించి నకిలీ బ్రాండ్ అమ్ముతున్న కేటుగాలు.సిన్తటిక్ కలర్స్ వల్ల ప్రజల ఆరోగ్యం క్షీణిస్తోంది. ఆరోగ్యానికి భారీగా ప్రమాదం తో పాటు కడుపు నోప్పో,అలర్జీ లాంటి సమష్యాలు తలెత్తుతాయి. గైడెలెన్స్ ప్రకారం ఈ కలర్ వాడొచ్చు కానీ అది ఓన్లీ స్వీట్ లలో వాడాలి



కానీ,చాయ్ పతిలో వాడడం వల్ల వినియోగదారుల ఆరోగ్యం చాలా క్షిణిస్తుంది. ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణకు ఈ కల్తీ చాయ్ పత్తా దిగుమతి చేస్తున్న కేటుగాళ్లు. కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసే ఏ వ్యాపరస్థులైన వారి ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిటీ పోలీసులు హెచ్చరిస్తున్నారు.చాయ్ పత్తి కొనే ముందు వినియోగదారులు జాగ్రత్తలు చూసుకొని కొనాలని అధికారులు కోరుతున్నారు. హెచ్ -ఎఫ్ఏఎస్టీ టీమ్ సీక్రెట్ ఆపరేషన్‌తో 15 చోట్ల దాడులు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.కల్తీ టీ తయారీలో సింథటిక్ రంగులు వినియోగం ప్రమాదకరం.తక్కువ నాణ్యత టీ పౌడర్‌తో కల్తీ తయారీ కేంద్రాల దాడులు.కాలం చెల్లిన (ఎక్స్‌పైర్)అయిన టీ పౌడర్ వినియోగం వల్ల ప్రాణాంతకరం,



ఒక్కోక్క సారి చనిపోయే అవకాశం లేకపోలేదు. ఇటువంటి హానికర రంగుల వినియోగం వల్ల పసి పిల్లలు పై మరింత ప్రభావం చూపుతుంది.ఫేక్ బ్రాండ్స్ పేర్లతో మార్కెట్లో



విక్రయిస్తున్న ముఠాలను గుర్తిస్తున్నారు హెచ్ -ఎఫ్ఏఎస్టీ అధికారులు. రోడ్డుసైడ్ టీ స్టాల్స్‌తో పాటు పేరున్న విక్రేతలకు సరఫరా చేస్తున్న కల్తీ ముఠాలు. అసలు టీ లా చూపించి ప్రజలను మోసం చేస్తున్న కేటుగాళ్ళను నమ్మొద్దంటున్న అధికారులు. ఆరోగ్యానికి భారీ ప్రమాదం -- కడుపు సమస్యలు,అలర్జీలు తదితర సమస్యలు తలెత్తుతాయి. దీర్ఘకాలిక వ్యాధులకు కారణమయ్యే ప్రమాదం ఉంది.సుమారు 4000 కేజీల కల్తీ టీ పౌడర్ స్వాధీనం చేసుకున్నారు.100 కేజీల బెల్లం (జాగ్గరీ) స్వాధీనశీ.

### ఎల్బీనగర్‌లో ఎస్‌టీఎఫ్,ఎక్సైజ్ పోలీసుల సంయుక్త ఆపరేషన్ కొనసాగుతోంది.

అక్రమ మద్యం రవాణా పై కట్టడి చర్యల్లో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో భారీగా మద్యం బాటిల్స్ పట్టుబడ్డాయి.అదే సమయంలో గంజాయి సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఢిల్లీ,గోవా ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్ట్ మార్గంగా అక్రమంగా మద్యం రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు ఎస్‌టీఎఫ్ టీం, అంజిరెడ్డి ఆధ్వర్యంలో మీర్పేట్ ఎక్సైజ్ పోలీసులతో కలిసి పహడ్ షరీఫ్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో మొత్తం 100 మద్యం బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.అందులో 58 బాటిల్స్‌ను ఎస్‌టీఎఫ్ అధికారులు పట్టుకోగా,మరో 42 బాటిల్స్‌ను మీర్ పేట్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. పట్టుబడిన మద్యం బాటిల్స్‌ను మీర్ పేట్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు.ఇక మరో ఘటనలో గంజాయి సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేయడం జరిగింది.4.1 గ్రాముల గంజాయితో ప్రయాణిస్తున్న వాహనాన్ని ఎస్‌టీఎఫ్,ఎక్సైజ్ బృందం తనిఖీల్లో పట్టుకోవడం జరిగింది.రాహుల్ మహేశ్వరి అనే వ్యక్తికి డ్రగ్ టెస్ట్ నిర్వహించగా, గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు.వెంటనే అతన్ని అరెస్ట్ చేసి,వాహనాన్ని సీజ్ చేసి మీర్ పేట్ పోలీసులకు అప్పగించారు.అక్రమ రవాణాపై పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఇటువంటి తనిఖీలు మరింత కఠినంగా కొనసాగుతాయని ఎస్టీఎఫ్ టీం అంజిరెడ్డి తెలిపారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588